ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



సిద్దిపేట
20
బుధవారం 30 ఆగస్టు 2017



(ఫైల్ ఫొటో)

రైతన్నకు జీఎస్టీ ఊరట

కొత్త ధరలతో అందుబాటులోకి వచ్చిన ఎరువులు

- జీఎస్టీ మినహాయింపుతో తగ్గిన భారం
- నూతన ఎమ్మార్పీతో మార్కెట్‌లో విక్రయం
- ఆనందం వ్యక్తం చేస్తున్న జిల్లా యంత్రాంగం

5



జీఎస్టీ ధరలతో అందుబాటులో ఉన్న ఎరువు

రింగ్‌రోడ్డు పనులను
జెట్‌స్పీడ్‌తో చేయాలి



రోడ్ల ప్రగతిపై గజ్వేల్ గెస్ట్‌హౌస్‌లో సమీక్ష నిర్వహిస్తున్న మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి

- రెండు నెలల్లో భూసేకరణ పూర్తి చేయండి
- రేడియల్ రోడ్ల విస్తరణ పనులు వేగవంతమవ్వాలి
- 31న బాధితులతో ఆర్డీవో కార్యాలయంలో మాట్లాడుదాం
- అధికారులకు మెదక్ పార్లమెంట్ సభ్యుడు కొత్త ప్రభాకర్‌రెడ్డి సూచన
- గజ్వేల్ ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌజ్‌లో ఆర్‌అండ్‌బీ ఈఎన్‌సీ, అధికారులతో సమీక్ష

5 లో

తెలంగాణ రాష్ట్ర సాధనలో కళాకారులది కీలకపాత్ర

- కళాకారులను గౌరవంగా చూసింది సీఎం కేసీఆర్
- సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీక మన కళలు
- కళలను భావితరాల వారికి తెలియజేయాలి
- సిద్దిపేట మునిసిపల్ చైర్మన్ రాజనర్సు
- ఘనంగా జానపద జాతర కార్యక్రమం

20

పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న కళాకారులు



డిగ్రీ కళాశాలకు
దక్కనున్న మరో గౌరవం

- నేడు సిద్దిపేటలోని ప్రభుత్వ కళాశాలకు న్యాక్ బృందం
- న్యాక్ ఎ++ గ్రేడ్‌కు పరిశీలన
- సర్వం సిద్ధం చేసిన యాజమాన్యం

4 లో

సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల



అనుమతుల్లేని నిర్మాణం కూల్చివేత

3

జేసీబీతో అక్రమ నిర్మాణాన్ని కూల్చివేస్తున్న మున్సిపల్ సిబ్బంది



వీఆర్వో, వీఆర్‌ఏల సస్పెన్షన్

- టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్‌పై వేటు
- ప్రభుత్వ భూమిని పరిరక్షించడంలో విఫలం
- సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు

3

ఇంటర్వ్యూ



ఫిట్‌నెస్ లేని వాహనాలపై చర్యలు

- జిల్లాలో మూడు యూనిట్ ఆఫీసులు ఏర్పాటు
- రామేశ్వర్‌రెడ్డి, సిద్దిపేట డీటీవో

సిద్ది పేట క్రైం : ఫిట్‌నెస్ లేని వాహనాలపై చర్యలు తీసుకుంటామని సిద్దిపేట డీటీవో రామేశ్వర్‌రెడ్డి తెలిపారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా సిద్దిపేట జిల్లాలోని గజ్వేల్, హుస్నాబాద్, చేర్యాలలో యూనిట్ ఆఫీసులను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. పలు విషయాలపై ఆయన ఆంధ్రజ్యోతితో ప్రత్యేకంగా మాట్లాడారు.

జిల్లాలో ఎన్ని ఫిట్‌నెస్ వాహనాలు ఉన్నాయి ?

జిల్లాలో అన్ని కేటగిరిల వాహనాలు కలిపి మొత్తం 104308 వాహనాలకు ఫిట్‌నెస్ పూర్తి చేశాం.

ఫిట్‌నెస్ లేని వాహనాల విషయంలో మీరు తీసుకునే చర్యలు ఏమిటి ?

ఫిట్‌నెస్ లేని వాహనాలు రోడ్డుపై తిరిగితే పట్టుకొని సీజ్ చేస్తాం. వాహనాన్ని బట్టి రూ. 2 వేల నుంచి రూ. 5 వేల దాకా జరిమానా విధిస్తాం.

వాహనదారులకు మీరిచ్చే సూచనలేమిటి ?

వాహనదారులు కచ్చితంగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలి. వాహనం రిజిస్ట్రేషన్, ఇన్సూరెన్స్ పేపర్‌లను కలిగి ఉండాలి. మద్యం సేవించి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనం నడపరాదు.

వాహనాల షోరూంలకు మీరిచ్చే అనుమతులు ఏమిటి ?

వాహనాల షోరూం ఏర్పాటుకు అనుమతిని మేమే ఇస్తాం. అలాగే వారు వాహనం టీఆర్ నంబర్‌ను క్రియేట్ చేసుకోవడానికి అనుమతిని ఇస్తాం.



కొత్తిమీర కోస్తున్న కూస లలిత, రాజు

లాభాలు బాగు

మార్కెట్లో దేనికి డిమాండ్ ఉన్నదో దాన్ని ఉత్పత్తి చేస్తే ఆదాయం పొందొచ్చు. ఈ సూత్రం వ్యాపారులకే కాదు.. రైతులకూ వర్తిస్తుంది. రసాయన మందులు వినియోగించి సాగు చేసిన వాటికంటే.. సేంద్రియ విధానంలో పండించిన వాటికి ఇప్పుడు మంచి డిమాండ్ ఉంది. దీన్ని గుర్తించిన కొందరు కర్షకులు సేంద్రియ బాట పడుతున్నారు. రసాయన సేద్యం నుంచి ఆ దిశగా వెళ్లే క్రమంలో కొన్ని ఇబ్బందులు ఎదురైనా ఓర్పు, నేర్పుతో వాటిని అధిగమించి మంచి లాభాలు అందుకుంటున్నారు. అంతే కాదు వినియోగదారులకు మంచి ఆకుకూరలు, కూరగాయలు అందజేస్తూ పేరు తెచ్చుకుంటున్నారు. ఇలాంటి సాగు పద్ధతుల ద్వారానే లాభాలు ఆర్జిస్తున్న రైతు దంపతులపై కథనం.

- కూరగాయలు, ఆకుకూరలు పండిస్తూ మంచి ఆదాయం పొందుతున్న దంపతులు
- రసాయన మందులు వినియోగించకుండా సాగు
- ప్రభుత్వ సాయం కోసం ఎదురు చూపు

మద్దూరు: ప్రస్తుతం చాలామంది విష కలుషితాలు లేని స్వచ్ఛమైన ఆహారోత్పత్తులనే వినియోగిస్తున్నారు. దీంతో రసాయన ఎరువులు, పురుగు మందులు వాడని ఆకు కూరలు, కూరగాయలకు మార్కెట్లో మంచి డిమాండ్ ఏర్పడింది. రసాయన వినియోగించి పండించిన కూరగాయలు ఆరోగ్యాన్ని కొద్దిగైనా పాడు చేస్తాయి. అలాగే వీటిని పండించే రైతులు కూడా చాలా ఆర్థికభారం భరించాల్సి వస్తోంది. రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులకు భారీగా ఖర్చు చేయాల్సి వస్తోంది. దీంతో దిగుబడులపై లాభాలు అంతగా రావడం లేదు. ఈ నేపథ్యంలో కొందరు రైతులు సేంద్రియ సాగుపై దృష్టి సారించి అందులో అధిక రాబడి సాధిస్తున్నారు. ఇదే బాటలో పయనిస్తూ మంచి ఆదాయాన్ని అర్జిస్తున్నారు మండలంలోని మర్మాముల గ్రామానికి చెందిన దంపతులు కూస లలిత, రాజు.

వీరికి 3. 30 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. అలాగే మరో రెండెకరాలను కౌలుకు తీసుకున్నారు. రెండెకరాల్లో వరి, ఎకరన్నరలో తోటకూర, కలెగూర, పాలకూర, గోంగూర, చుక్కకూర, గంగవాయిలికూరలతో పాటు గోరుచిక్కుడు, కొత్తిమీర, మెంతికూర సాగు చేస్తున్నారు. కౌలుకు తీసుకున్న రెండెకరాల్లో పత్తి వేశారు. ఇక కూరగాయల దిగుబడులను చుట్టు పక్కల గ్రామాల్లో సాగే సంతల్లో విక్రయిస్తున్నారు. వీరే సొంతంగా కూరగాయలను అమ్ముకోవడం వల్ల మంచి లాభాలు పొందుతున్నారు. వారంలో చిన్న సంతల్లో రూ. 2 వేలు, పెద్ద సంతలో రూ. 2 వేల దాకా ఆదాయం వీరికి లభిస్తోంది. ఆ డబ్బును ఇతర పంటల సాగుకు వినియోగిస్తున్నారు. ఇక సాగు మొత్తం సేంద్రియ విధానంలో చేపట్టడం వల్ల పెద్దగా ఖర్చులు కూడా లేవు. మంచి రాబడులు వస్తున్నాయి.



ఎనిమిదేళ్లుగా పండిస్తున్నా

ఎనిమిదేళ్లుగా సేంద్రియ విధానంతో ఆకుకూరలు, కూరగాయలు పండిస్తున్నా. ఒక్కోసారి వర్షాలతో ఆకుకూరలు దెబ్బతింటుండటంతో నష్టపోవాల్సి వస్తుంది. మా పొలంలోని బావిలో సరిపడ నీరు ఉండటంతో సాగునీటికి ఇబ్బందులు ఎదురుకాలేదు. సంతల్లో మారు వ్యాపారం నిర్వహించే వారికి కూరగాయలు ఇవ్వకుండా సొంతంగా విక్రయిస్తుండటంతో తెలిసిన వారే ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు. మంచి ఆదాయం వస్తుంది. ప్రభుత్వం చిన్నసన్నకారు రైతులకు పలు పథకాలు అందిస్తున్నట్లు చెబుతున్నా మాలాంటి రైతులకు మాత్రం అందడంలేదు.

- కూస రాజు, రైతు, మర్మాముల

ప్రభుత్వ పథకాలు రైతుల దరిచేరేలా చూడాలి

ప్రభుత్వ పథకాలు చిన్నసన్నకారు రైతుల దరిచేరేలా చూడాలి. ఉపాధిహామీ పథకంలో కల్లాల ఏర్పాటుతో పాటు కూరగాయల సాగులో పందిరిసాగుకు సబ్సిడీ అందివ్వాలి. కూరగాయల విత్తనాలు ప్రభుత్వమే వ్యవసాయశాఖ ద్వారా అందించాలి. డ్రిప్ సౌకర్యం కల్పించాలి. రైతులు పండించిన ఆకుకూరలు, కూరగాయలు దగ్గర్లోనే విక్రయించుకునేలా అందుబాటులో మార్కెట్ సౌకర్యం కల్పించాలి.

- కూస లలిత, రైతు, మర్మాముల



ఉద్యోగులకు వెంటనే బదిలీలు చేపట్టాలి

ఉద్యోగపర్వం



- మల్లేశం, టీఎన్జీవోస్ దుబ్బాక తాలూకా అధ్యక్షుడు

తెలంగాణలోని కొత్త జిల్లాల్లో వర్క్ టూ రూల్ కింద పని చేస్తున్న ఉద్యోగులకు వెంటనే బదిలీలు చేపట్టాలి. ప్రస్తుతం వారికి కేటాయించిన స్థానాలల్లో పనులు సక్రమంగా నిర్వర్తించలేకపోతున్నారు. ఉద్యోగ విభజన లేకపోవడం మూలంగా ఉద్యోగ బదీలులు కూడా చేపట్టలేని పరిస్థితి నెలకొంది. అన్ని ప్రభుత్వ కార్యాలయాలల్లో ఖాళీలు ఏర్పడడంతో ఉద్యోగులకు పని ఒత్తిడి పెరిగింది. సంక్షేమ కార్యక్రమాలు కూడా పూర్తి స్థాయిగా అమలు కాని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం వెంటనే స్పందించి పరస్పర బదిలీలకు అవకాశం కల్పించాలి. నూతన జిల్లాలో వర్క్‌టూ రూల్ కింద నియమితులైన ఉద్యోగులను వారి కోరిక మేరకు బదిలీ చేయాలి. ఇది ప్రభుత్వానికి ఆర్థిక భారం లేని సమస్య. కాబట్టి వెంటనే పరిష్కరించాలి. వసతి గృహల్లో నాల్గో తరగతి ఉద్యోగుల స్థానాలు ఖాళీలు లేకుండా చూడాలి. ఉద్యోగుల నియామక, పదోన్నతుల్లో జోనల్ వ్యవస్థను రద్దు చేయాలి. ఉద్యోగుల పదోన్నతులను నెలనెలా సీనియార్టీని బట్టి చేపట్టాలి.

- దుబ్బాక

శివాలయాల్లో ప్రదక్షిణ ఇలా చేయాలి !

భక్తి

- చప్పి విశ్వప్రసాద్‌శర్మ, పురోహితుడు, దుబ్బాక

అన్ని ఆలయాల్లో మాదిరిగా శివాలయాలల్లో ప్రదక్షిణ చేయరాదు. చాలామంది శివాలయాల చుట్టూ అన్ని దేవాలయాల్లోలాగే ప్రదక్షిణ చేస్తారు. దీనివల్ల ప్రదక్షిణ ఫలం లభించదు. శివాలయాల్లో ప్రదక్షిణ భిన్నంగా ఉంటుంది. ధ్వజస్తంభం ముందు నుంచి ప్రారంభించి, సోమసూత్రం వరకు వెళ్లి మళ్లీ అక్కడి నుంచి వెనుదిరిగి ధ్వజస్తంభం గుండా మళ్లీ సోమసూత్రం వరకు వచ్చి ప్రదక్షిణ చేయాలి. ధ్వజస్తంభం వరకు వచ్చినట్లయితే ఒక ప్రదక్షిణ పూర్తవుతుంది. సోమసూత్రం శివుడిని అభిషేకించిన నీటితో వెళ్లే ద్వారం. దీనిని దాటడం మహాపాపం. గుడి చుట్టూ తిరగడం భక్తులకు అనవాయితీగా మారింది. ఈ పద్ధతిని శివాలయాల్లో పాటించరాదు. భక్తులు తెలియక మహాఅపచారానికి పాల్పడుతున్నారు. అయితే తెలియక చేసిన దానికి తప్పులేదు. ప్రదక్షిణ ఫలం మాత్రం భక్తులకు లభించదు. శివాలయాల చుట్టూ ప్రదక్షిణ మూడు లేదా ఐదుసార్లు చేయవచ్చు. ప్రదక్షిణ చేస్తున్నంతసేపు శివనామస్మరణం తప్పక చేయాలి. అంతేగాక శివనామపంచాక్షరి మంత్రమైన ఓం నమః శివాయాః స్మరించాలి. ప్రదక్షిణ చేస్తున్న భక్తులు సోమసూత్రం వద్దనే చేతులతో తాకి నమస్కరించాలి. ఈ విధానం పాటించిన భక్తులు శివానుగ్రహానికి పాత్రులవుతారు. శివుడిని అభిషేకించిన నీరు శిరస్సుపై చల్లుకుంటే పాపాలు ఎలా దూరమవుతాయో, అలాంటి ఫలం సోమసూత్ర స్పర్శవల్ల లభిస్తుందని శివపురాణం చెబుతోంది.



- దుబ్బాక

అనుమతిలేని నిర్మాణం కూల్చివేత

సిద్దిపేట మునిసిపాలిటీ: సిద్దిపేట మండల ప్రజాపరిషత్ కార్యాలయం వెనుక అనుమతి లేకుండా నిర్మిస్తున్న కట్టడాన్ని మంగళవారం మున్సిపల్ కార్యాలయం పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు కూల్చివేశారు. ఈ సందర్భంగా భవన యజమానులకు మున్సిపల్ సిబ్బందికి స్వల్ప వాగ్వాదం జరిగింది. నోటీసులు, ఇవ్వకుండానే అధికారులు కూల్చి వేస్తున్నారని భవన యజమానులు ఆరోపించారు. కానీ, తాము గతంలోనే నోటీసులు జారీచేసి నిర్మాణాన్ని ఆపివేయాలని హెచ్చరించినట్లు టౌన్ ప్లానింగ్ అధికారులు తెలిపారు. ఉద్రిక్తత కారణంగా వన్ టౌన్ సీఐ నందీశ్వర్, ఎస్ఐలుగోపాల్‌రావు, రాజేంద్రప్రసాద్ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

వీఆర్వో, వీఆర్ఏ, టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్ల సస్పెన్షన్

సిద్దిపేట మునిసిపాలిటీ: ప్రభుత్వ భూమిని పరిరక్షించడంలో విఫలమైన కారణంగా సిద్దిపేట అర్బన్ మండలం, సిద్దిపేట పట్టణ వీఆర్వో ఇల్లెందుల వెంకటేశ్‌ను, వీఆర్ఏ సాకి యాదగిరి, సిద్దిపేట మునిసిపాలిటీ టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ హబీబ్ ఉన్నీసాలను అధికారులు సస్పెండ్ చేశారు. వీఆర్వోను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేయగా, వీఆర్ఏ, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్లను సస్పెండ్ చేస్తూ తహసీల్దారు ఉత్తర్వులు జారీ చేశారు. హైదరాబాద్ రోడ్డును ఆనుకొని సర్వే నెంబర్ 1340లోని ప్రభుత్వ భూమిని స్థానికులు ఆక్రమించి ఇళ్ల నిర్మాణం చేపట్టారు. దీంతో ప్రభుత్వ భూమిని రక్షించడంలో వారు విఫలమయ్యారని కలెక్టర్‌కు ఆర్డీవో ముత్యంరెడ్డి నివేదించారు. దీంతో కలెక్టర్ శాఖాపరమైన చర్యలు తీసుకున్నారు. అలాగే అర్బన్ గిరిదావర్ రాజేశ్‌కు చార్జీ మెమో జరీచేశారు.

బియ్యం తరలిస్తున్న ఇద్దరి రిమాండ్

జగదేవ్‌పూర్: మండల కేంద్రమైన జగదేవ్‌పూర్ నుంచి అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న ఇద్దరి వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. జగదేవ్‌పూర్‌కు చెందిన అయుత రాములు, అలిరాజ్‌పేటకు చెందిన జాప మల్లేశ్ రెండు రోజుల క్రితం అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తుండగా పట్టుకుని, బియ్యం స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ వీరన్న తెలిపారు. మంగళవారం వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

'దేవిశ్రీకాంత్ మృతికి బాధ్యులైన వారిపై క్రిమినల్ కేసులు పెట్టాలి'

మెదక్ మున్సిపాలిటి: పై అధికారుల ఒత్తిడితో ఏఈ దేవిశ్రీకాంత్ మృతిచెందిన సంఘటన దురదృష్టకరమని పంచాయతీరాజ్ శాఖ ఏఈ సంజీవరావు, ఈఈ వెంకటేశ్వర్లు అన్నా రు. కొమరంభీం సబ్‌డివిజన్ పరిధిలోని ఆసిఫాబాద్ ఎఈగా పని చేస్తున్న దేవిశ్రీకాంత్ పై అధికారుల ఒత్తిడికి బలవడం బాధాకరమ న్నారు. అదే డివిజన్‌లోని ఈఈ రఘువీరారెడ్డి, ఖ్యాసి నిర్మల్‌గారి వేధింపులు తాళలేక ఆత్మ హత్య చేసుకుంటున్నట్లు లేఖ రాసి మృతి చెం దడం ఆవేదనకు గురిచేసిందన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, ఇందుకు బా ధ్యులైన పై అధికారులను కఠినంగా క్రిమినల్ కేసులు నమోదు చేయాలని మంగళవారం వారు డిమాండ్ చేశారు. అనంతరం ఇలాంటి సంఘటనలు ఖండిస్తున్నామని పంచాయతీ రాజ్ ఇంజనీర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపా ధ్యక్షులు జగదీశ్వర్, రీజనల్ సెక్రటరీ హన్మాండ్లు, మెదక్ జిల్లా అధ్యక్షులు యుగే ందర్, ప్రధాన కార్యదర్శి పవన్‌కుమార్, డిప్ల మా ఇంజనీర్స్ రాష్ట్ర ఆర్గనైజేషన్ సెక్రటరీ పాం డురంగారెడ్డి, ప్రభాకర్‌లతో పాటు ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్లు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆటోలు బోల్తాపడి కూలీ దుర్మరణం

రాయపోల్: కూలీ పనుల కోసం వెళ్లి రోడ్డు ప్రమాదంలో వ్యవసాయ కూలీ మృతిచెందిన సంఘటన మంగళవారం దౌల్తాబాద్ మండలం సూరంపల్లిలో జరిగింది. చేగుంట మండలం రాంపూర్ గ్రామానికి చెందిన కొందరు కూలీలు ఆటోలో తొగుట మండలం లింగాపూర్‌లో వ్యవసాయ పనులకు బయలుదేరారు. ఈ క్రమంలో దౌల్తాబాద్ మండలం సూరంపల్లి వద్ద అతివేగంతో వెళ్తున్న ఆటో ఎదురుగా వెళ్తున్న మరో ఆటోను ఢీకొట్టింది. దీంతో రెండు ఆటోలు బోల్తా పడ్డాయి. దీంతో కూలీలు తీవ్రంగా గాయపడగా వారిని 108 వాహనంలో సిద్దిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రాంపూర్ గ్రామానికి చెందిన కూలీ చెండి స్వామి పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. ఈ ఘటనతో రాంపూర్ గ్రామంలో తీవ్ర విషాదం అలుముకున్నది.





ప్రమాదానికి గురైన ఆటో, ప్రమాదంలో మృతిచెందిన చెండి స్వామి

డీసీఎం ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

సంగారెడ్డి రూరల్: డీసీఎం ఢీ కొనడంతో గుర్తు తెలియని వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన సోమవారం రాత్రి సంగారెడ్డి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. సంగారెడ్డి రూ రల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...కంది వైపు నుంచి వస్తున్న గుర్తు తెలియని వ్యక్తి (40) పోతిరెడ్డిపల్లి చౌరస్తాలోని ఉజ్వల వైన్స్ సమీపంలో రోడ్డు దాటుతున్న క్రమంలో జహారాబాద్ నుంచి హైదరాబాద్ వెల్తున్న డీసీఎం వ్యాన్ ఎదురుగా వచ్చి ఢీ కనడంతో తీవ్రంగా గాయాల పాలైన వ్యక్తిని చికిత్స నిమిత్తం సంగారెడ్డి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్సపొందుతూ మంగళవారం మద్యాహ్నాం 12 గంటల సమయంలో మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. ఈ మేరకు ఎస్ఐ శివలింగం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రైస్‌మిల్‌లో టాస్క్‌ఫోర్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ తనిఖీ

- 191క్వింటాళ్ల బియ్యం సీజ్, యజమానులపై కేసు

రాయపోల్: రాయపోల్ మండలం రామారం గ్రామంలోని మహాలక్ష్మీ రైస్‌మిల్‌లో అవకతవకలు జరుగుతున్నాయన్న నమ్మదగిన సమాచారం మేరకు మంగళవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ టాస్క్‌ఫోర్స్ అధికా రులు తనిఖీ చేశారు. గత ఫిబ్రవరిలో రైస్‌మిల్‌లో అధికారులు తనిఖీచేయగా 250క్వింటాళ్ల పీడీఎఫ్ బియ్యం గుర్తించి, ఆ బియ్యం సంచులను సీజ్‌చేసి అదే రైస్‌మిల్‌లో ఉంచారు. అయితే, రైస్‌మిల్ యజ మానులు సీజ్ చేసిన బియ్యాన్ని విక్రయించారన్న సమాచారం మేరకు మంగళవారం మళ్లీ తనిఖీచే శారు. సీజ్ చేసిన పీడీఎఫ్ బియ్యం కనిపించలేదు. ప్రస్తుతం మిల్లులో 191క్వింటాళ్ల కొత్త బియ్యం మాత్రమే ఉన్నాయి. సీజ్‌చేసిన బియ్యాన్ని విక్రయించి నందుకు మిల్లు యజమానులపై కేసు నమోదు చేశారు. మిల్లులో ఉన్న 191క్వింటాళ్ల బియ్యాన్ని సీజ్ చేసి దౌల్తాబాద్ ఎంఎల్ఎస్ పాయింట్‌కు తరలించి నట్లు టాస్క్‌ఫోర్స్ ఓఎస్డీ విశ్వనాథం తెలిపారు.



తనిఖీ చేస్తున్న అధికారులు

రేషన్ బియ్యాన్ని పక్కదారి పట్టిస్తే చర్యలు

రేషన్ బియ్యాన్ని బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తే చట్ట ప్రకారం చర్యలు తప్పవని సిద్దిపేట జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి వెంకటేశ్వర్లు హెచ్చరించారు. రేషన్ దుకాణాల్లో ఈ-పాస్ విధానంతో రేషన్ బియ్యం పక్కదారి పట్టకుండా కొంతవరకు అరికడుతున్నామన్నారు.

టీఆర్ఎస్ రాష్ట్ర నేత నర్సింహారెడ్డికి మాతృవియోగం

జగదేవ్‌పూర్: టీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, గజ్వేల్ నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జ్ కేశిరెడ్డి నర్సింహారెడ్డి మాతృ వియోగం చెందారు. మండలంలోని పీర్లపల్లి గ్రామానికి చెందిన నర్సింహారెడ్డి తల్లి కేశిరెడ్డి అనసూయ(75)కు సోమవారం అర్ధరాత్రి గుండెపోటు రావడంతో ఆసుపత్రికి తరలిస్తుండగా మృతిచెందింది. కేశిరెడ్డి అనసూయ భర్త మల్లారెడ్డి 25సంవత్సరాల పాటు సర్పంచ్‌గా సేవలందించారు. కాగా నర్సింహారెడ్డిని జగదేవ్‌పూర్ ఎంపీపీ రేణుకా, జడ్పీటీసీ ఎంబరి రాంచంద్రం, పీఏసీఎస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి, సర్పంచులు రాధా, కరుణాకర్, టీఆర్ఎస్ నాయకులు యాదవరెడ్డి, జంభుల శ్రీనివాస్‌రెడ్డి, ఉపేందర్‌రెడ్డి, గుండ రంగారెడ్డి, పిట్ల సత్యనారాయణ, ఊడెం కృష్ణారెడ్డి, నాయిని యాదగిరి, ఎస్సీ రాజమౌలి, కమ్మరి బాల్‌రాజు, తుమ్మ కృష్ణ, ప్రసాద్, గోపీనాథ్, డాక్టర్ నవీన్, శ్రీనివాస్‌రెడ్డి, శవిధర్‌రెడ్డి పరామర్శించారు.



కేశిరెడ్డి నర్సింహారెడ్డిని పరామర్శిస్తున్న నేతలు



విజయకు పుష్పం ఇచ్చి స్వాగతం పలుకుతున్న అంగన్‌వాడీ టీచర్లు

మాతాశిశు మరణాలు
అరికట్టడమే ప్రభుత్వ లక్ష్యం

మహిళా శిశు సంక్షేమ శాఖ సిద్దిపేట, జనగామ జిల్లాల కో ఆర్డినేటర్ బూర విజయ

సిద్ధిపేట రూరల్: మాతాశిశు మరణాలు అరికట్టడమే ప్రభుత్వ లక్ష్యమని మహిళా శిశు సంక్షేమ శాఖ సిద్దిపేట, జనగామ జిల్లాల కో ఆర్డినేటర్ బూర విజయ అన్నారు. సిద్దిపేట మండలం తోర్నాల గ్రామంలో మంగళవారం జరిగిన అంగన్‌వాడీ టీచర్ల కార్యక్రమానికి ఆమె హాజరై మాట్లాడారు. ప్రభుత్వం పేదల ఆరోగ్యం కోసం కృషి చేస్తోందని, ప్రతి వెయ్యి మందికి ఒక అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేస్తున్నమన్నారు. ఆరు సంవత్సరాలలోపు పిల్లలందరినీ స్థానిక అంగన్‌వాడీ కేంద్రానికి పంపాలన్నారు. గర్భిణి, బాలింతలకు పౌష్టికాహారం అందించేందుకు ఆరోగ్యలక్ష్మి పథకం ప్రవేశ పెట్టిందన్నారు. నాణ్యమైన ఆహారం అందించాలని సూచించారు. అనంతరం సిద్దిపేటలోని హౌసింగ్ బోర్డు కాలనీలో జరిగిన అర్బన్ ప్రాంతం అంగన్‌వాడీ టీచర్ల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సుపర్‌వైసర్ రమా, సర్పంచ్ పరమేశ్వర్ గౌడ్, ఎంపీటీసీ నర్సింలు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

రేషన్‌కార్డులో పేరున్న
ప్రతి మహిళకూ బతుకమ్మ చీర



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో శంకర్‌కుమార్

మద్దూరు: రేషన్‌కార్డులో పేరుండి 18యేళ్లు నిండిన ప్రతి మహిళకూ బతుకమ్మ పండుగను పురస్కరించుకొని సెప్టెంబర్ 20నుంచి 27 తేదీ వరకు బతుకమ్మ చీరలు అందజేయనున్నట్లు ఆర్డీవో శంకర్‌కుమార్ తెలిపారు. మంగళవారం మద్దూరు తహసీల్దార్ కార్యాలయంలో ఆయన వీఆర్వోలతో సమావేశమయ్యారు. రేషన్ కార్డుల ఆధారంగా సర్వే చేసిన 13,713 మందికి బతుకమ్మ చీరలు తెప్పించనున్నట్లు తెలిపారు. రేషన్ కార్డుల్లో పేరు లేని మహిళల కోసం కూడా చీరలు తెప్పించనున్నట్లు వివరించారు. చీరల పంపిణీ కార్యక్రమాన్ని వీఆర్వో, పంచాయతీ సెక్రటరీ, గ్రామైఖ్య సంఘం అధ్యక్షురాలు, ఐకేపీ ఏపీఎంకు అప్పగిస్తామన్నారు. అలాగే సెప్టెంబర్ 15లోపు రైతులకు సంబంధించిన రెవెన్యూ రికార్డుల పరిశీలన పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి తహసీల్దారు శైలజ, సీనియర్ అసిస్టెంట్ సురేందర్, ఆర్ఐ సంతోష్, జూనియర్ అసిస్టెంట్ జమాలొద్దీన్, వీఆర్వోలు అయిలయ్య, బాల్‌చందర్, శ్రీనివాస్, విజయ్, యాదగిరి, నర్సయ్య, రాజు, విజయలక్ష్మి పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలకు దక్కనున్న మరో గౌరవం

- ఏ++ గ్రేడ్ దక్కే అవకాశం
- నేడు కళాశాలకు న్యాక్ బృందం
- సర్వం సిద్ధం చేసిన కళాశాల బృందం

సిద్ధిపేట రూరల్: సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు మరో గౌరవం దక్కనుంది. ఎంతో మంది నిరుపేద విద్యార్థులను ప్రయోజకులుగా తీర్చిదిద్దిన ఘనత ఈ కళాశాలకు ఉంది. 1956లో 30మంది విద్యార్థులతో బీఏ, బీఎస్సీ కోర్సులతో ప్రారంభమైంది. ఆ రోజుల్లో ఈ కళాశాలల్లో ప్రతిభావంతులకే సీట్లు లభించేవి. అంచెలంచెలుగా ఎదుగుతున్న సిద్దిపేట కళాశాలకు న్యాక్ గ్రేడింగ్ విధానం లభించడం పట్ల ఈ ప్రాంత విద్యావంతులు, మేధావులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో 17యూజీ కోర్సులు, 6పీజీ కోర్సులు కలిగిన ప్రభుత్వ కళాశాలలు ఉన్నాయి. 2011లో న్యాక్ 'ఏ'గ్రేడ్ గుర్తింపు పొంది ఉమ్మడి రాష్ట్రంలోనే గ్రామీణ ప్రాంత డిగ్రీ కళాశాలలకు వన్నె తెచ్చిన ఘనత సిద్దిపేట డిగ్రీ కళాశాలకు దక్కింది. ప్రతి ఆరు సంవత్సరాలకోసారి 'ఏ' గ్రేడ్ పొందిన న్యాక్ కళాశాలలను రీ అక్రిడేషన్ పొందేందుకు అవకాశం ఉంటుంది. జాతీయ స్థాయిలో గ్రేడింగ్ ఇచ్చే కళాశాలలను న్యాక్ బృందం సభ్యులు సందర్శించి పలు అంశాలపై అధ్యయనం చేస్తారు. బృందం సభ్యులు ఇచ్చిన మార్కుల ఆధారంగానే న్యాక్ గ్రేడింగ్ హోదా లభిస్తుంది. బృందం సభ్యులు ముఖ్యంగా ఏడు అంశాలను పరిగణలోకి తీసుకుంటారు.

ఏడు అంశాలు

1. పాఠ్యాంశం, విద్యా ప్రణాళిక కోణాలు
2. బోధన, శిక్షణ, మూల్యాంకనం
3. పరిశోధనలో నూతన అంశం విస్తరణ
4. మౌలిక సదుపాయాలు, వనరులను సమకూర్చుకోవడం
5. పాలన, నాయకత్వం నిర్వహణ, విధానాలు
6. సంస్థాగత విలువలు, అవలంబించే పద్ధతులు
7. విద్యార్థులకు సౌకర్యాల కల్పన

సీజీపీఏ విధానం

న్యాక్ గ్రేడింగ్ పొందిన డిగ్రీ కళాశాలకు ఈ విధంగా సీజీపీఏ మార్కులు లభిస్తాయి. 1. 51 - 2.00 మార్కులు పొందిన కళాశాలకు సీ గ్రేడింగ్, 2. 01 - 2.50 మార్కులు పొందిన కళాశాలకు బీ గ్రేడ్, 2.51 - 2.75 మార్కులు పొందిన కళాశాలకు బీ+ గ్రేడింగ్, 3.01-3.50 మార్కులు పొందిన కళాశాలకు ఏ గ్రేడింగ్, 3.51-3.75 మార్కులు పొందిన కళాశాలకు ఏ+ గ్రేడింగ్ , 3.76 - 4.00 మార్కులు పొందిన కళాశాలకు ఏ++ గ్రేడ్ కేటాయిస్తుంది. 2011లో సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల న్యాక్ గ్రేడింగ్ కోసం దరఖాస్తు చేసుకుంది. అప్పుడు కళాశాలను సందర్శించిన న్యాక్ పరిశీలన బృందం కళాశాలకు బీ గ్రేడ్ కేటాయించింది. రీ అక్రిడేషన్ కోసం దరఖాస్తు చేయగా సెప్టెంబర్ 9న కళాశాలను న్యాక్ ఫీర్ బృందం సందర్శించింది. కళాశాలలో విద్యా ప్రమాణాల , సౌకర్యాలు, నూతన అధ్యయన అంశాల ఆధారంగా కళాశాలకు 3.02 మార్కులు కేటాయించి ఏ+ గ్రేడింగ్‌ను ప్రకటించింది. కళాశాలలో విద్యార్థుల సౌకర్యం కోసం లైబ్రరీని విస్తరింపజేస్తూ 14కంప్యూటర్లతో ఈ లైబ్రరీని ప్రారంభించారు. కళాశాల ప్రాంగణంలోనే విశాలమైన స్థలం, మైదానం అన్ని అంశాలకు ప్రత్యేక ప్రయోగశాలలు ఉండగా ఇటీవల మంత్రి హరీశ్‌రావుచే తెలుగు పరిశోధన కేంద్రం ప్రారంభించారు. ఆధునాతన వ్యాయమశాల, పరిశ్రమలు, విద్యాసంస్థలతో ఒప్పం దాలు చేసుకొని పలు మార్లు జాబ్‌మేళాలు నిర్వహిస్తూ ఎంతో మంది విద్యార్థులకు ఉపాధిని కల్పించింది. విద్యార్థులను ప్రోత్సహించేందుకు ప్రతి ఏటా పూర్వ విద్యార్థులు రూ. 60 వేల నగదు బహుమతులను అందిస్తున్నారు. 2005లో పూర్వ విద్యార్థుల ఆధ్వ ర్యంలో కళాశాల స్వర్ణోత్సవాలు అట్టహసంగా జరిపా రు. కళాశాలలో 6 ఎన్ఎస్ఎస్ బృందాలు, 1 ఎన్‌సీసీ బృందం చురుకుగా పనిచేస్తుంది.

న్యాక్ ఫీర్ బృందం...

సిద్దిపేట డిగ్రీ కళాశాలకు రీఅక్రిడేషన్ కోసం ముగ్గురు సభ్యులతో కూడిన న్యాక్ ఫీర్ బృందాన్ని నియమించింది. న్యాక్ కో-ఆర్డినేటర్ డాక్టర్ తూకారం అప్పయే శివారే, జయరాజ్ అన్నపాకీయం మహిళ కళాశాల ప్రిన్సిపాల్ టి. నిర్మల, చౌదరి చరణ్‌సింగ్ యూనివర్సిటీ వైస్ ఛాన్సులర్ ప్రొఫెసర్ కె. తనేజా న్యాక్ ఫీర్ బృందం సభ్యులుగా సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలను సందర్శించనున్నారు.



సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల

మంత్రి కృషి ఫలితం

భారీ నీటిపారుదల శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ప్రత్యేక కృషితో ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు న్యాక్ గుర్తింపు లభించింది. కళాశాల అవసరాలను గుర్తిస్తూ అవసరమైనన్ని నిధులు కేటాయిస్తూ అభివృద్ధికి కృషి చేస్తున్నారు. కళాశాల ఆవరణలో క్యాంటీన్ నిర్మించేందుకు పూర్వ విద్యార్థులు చేస్తున్న కృషికి మంత్రి తోడ్పాటును అందిస్తున్నారు.

ఏ++ ఆశిస్తున్నాం



ఈ ప్రాంత విద్యార్థులకు ఉన్నత విద్య ప్రమాణాలను అందించేందుకు మంత్రి హరీశ్‌రావు కృషి అభినందనీయం. కళాశాల పూర్వ విద్యార్థుల ప్రోత్సాహం, మంత్రి సహకారం, అధ్యాపకుల కృషి ఫలితంగా ఈకళాశాలకు ఏ++ గ్రేడ్ లభిస్తుందని ఆశిస్తున్నాం.

- శ్రీనివాస్‌రెడ్డి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్,

పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి

- కలెక్టర్ వెంకట్రామారెడ్డి
- ప్రభుత్వ వైద్య కళాశాల భవన నిర్మాణ పనులు పరిశీలన

సిద్ధిపేట రూరల్: మండలంలోని ఎన్సాన్‌పల్లి పరిధి లో చేపట్టిన ప్రభుత్వ వైద్య కళాశాల భవన నిర్మాణ పనులను కలెక్టర్ వెంకట్రామారెడ్డి మంగళవారం పరిశీలించారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఆదేశించారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలన్నారు. వచ్చే ఏడాది కళాశాల ప్రారంభిస్తారని పేర్కొన్నారు. అప్పటిలోగా పనులు పూర్తి చేయాలన్నారు. కలేక్టర్ వెంట ఆర్డీవో ముత్యంరెడ్డి, తహసీల్దార్ పరమేశ్వర్ తదితరులు ఉన్నారు.

త్రీస్టార్ హోటల్ నిర్మాణానికి స్థల పరిశీలన

కొండపాక/సిద్ధిపేట రూరల్: కొండపాక మండల నాగులబండ, సిద్దిపేట మండలం నాంచారుపల్లి శివార్లలో త్రీస్టార్ హోటల్ నిర్మాణం కోసం కలెక్టర్ వెంకట్రామారెడ్డి మంగళవారం స్థలాన్ని పరిశీలించారు. టూరిజం శాఖ రూ. 15లక్షలతో హోటల్ నిర్మాణం చేపట్టనుంది. నాంచారుపల్లి శివారులో గల రెండెకరాల భూమిని, దుద్దెడ గ్రామ శివారులో ఆరు ఎకరాల భూమిని కలెక్టర్ పరిశీలించారు. ఈ భూములకు హద్దులు పాతి బోర్డు పెట్టాలని తహసీల్దార్‌కు సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో ముత్యంరెడ్డి, తహసీల్దార్ పరమేశ్వర్, ఆరీఫా, దుద్దెడ వీఆర్వో బాలకృష్ణ, ఆర్ఐ రాజేశం, రవీందర్, సర్వేయర్ రాంచంద్రం, పాల్గొన్నారు.



స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకట్రామారెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి

రైతు సమాఖ్యల ముసుగులో రాజకీయాలు సరికావు

- 2019 ఎన్నికల కోసమే రైతు సమాఖ్యల నాటకం
- గత పథకాల్లాగే రైతు సమాఖ్యలు
- తెలుగు రైతు రాష్ట్ర అధ్యక్షుడు వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్: రైతు సమాఖ్యల ముసుగులో ప్రభుత్వం చేస్తున్న రాజకీయాలు సరికావని తెలుగు రైతు రాష్ట్ర అధ్యక్షుడు వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన గజ్వేల్ ఆర్అండ్‌బీ అతిథిగృహంలో విలేకరులతో మాట్లాడారు. 2019ఎన్నికల్లో లబ్ధి కోసమే ప్రభుత్వం రైతు సమాఖ్యల నాటకానికి తెరలేపిందన్నారు. గతంలో ప్రవేశపెట్టిన గ్రామజ్యోతి, ఫాస్ట్ పథకం, దళితులకు మూడెకరాల భూమి తరహాలోనే రైతు సమాఖ్యలు మారనున్నాయన్నారు. రైతుల సంక్షేమం పేరిట రాజకీయాలు చేయడం మానుకోవాలన్నారు. గ్రామాల్లో రైతు సమాఖ్యల పేరుతో ప్రజల మధ్య చిచ్చుపెట్టే ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజలు అన్ని గమనిస్తున్నారని, వారి చేతిలో గుణపాఠం తప్పదని హెచ్చరించారు. సమావేశంలో కౌన్సిలర్లు ఉప్పల మెట్టయ్య, ఆర్కే శ్రీనివాస్, సీనియర్ నాయకులు పరచూరి రాజు, విరాసత్ అలీ, హనుమంతరెడ్డి, సయ్యద్ మథిన్, పేపర్ శ్రీనివాస్, రఘుపతిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, వినోద్, అక్బర్, భాస్కర్‌రెడ్డి, మహిపాల్ పాల్గొన్నారు.



నర్సన్నపేటలో పంటను పరిశీలిస్తున్న కోటేశ్వర్‌రావు, అధికారులు

సాగులో ప్రణాళిక, ఆధునికతతోనే ఆర్థికాభివృద్ధి

• రాష్ట్ర సీడ్ కార్పొరేషన్ చైర్మన్ కొండబాల కోటేశ్వర్‌రావు

మర్కూక్: సాగులో ప్రణాళిక, ఆధునికత జోడిస్తే రైతులు లాభాలతో ఆదర్శంగా ఆర్థికాభివృద్ధి చెందుతారని రాష్ట్ర సీడ్ కార్పొరేషన్ చైర్మన్ కొండబాల కోటేశ్వర్‌రావు అన్నారు. మంగళవారం ఆయన సీఎం కేసీఆర్ దత్తత గ్రామాలైన ఎర్రవల్లి, నర్సన్నపేటను సందర్శించారు. రైతులు సాగుచేస్తున్న వ్యవసాయ క్షేత్రాలను పరిశీలించారు. అనంతరం సమావేశంలో మాట్లాడారు. రైతాంగం ఆర్థికాభ్యున్నతి సాధించేందుకు సాగులో ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలన్నారు. ఆధునిక విధానాలు, అధికారుల సూచనలు సలహాలు పాటించాలన్నారు. రైతులు క్షేత్రస్థాయిలో విత్తనోత్పత్తి చేపట్టాలని సూచించారు. రాష్ట్రంలో మేలుజాతి విత్తనం తయారీకి దాదాపు రూ. 400 కోట్లు వెచ్చించి విత్తనోత్పత్తి చేపడుతున్నామన్నారు. సెప్టెంబర్ 1 నుంచి 9 వరకు రైతు సమన్వయ కమిటీలను వేస్తున్నట్లు తెలిపారు. ముందుగా గ్రామస్థాయి రైతు కమిటీలు ఆ కమిటీ సభ్యులతో మండల, జిల్లా, రాష్ట్రస్థాయి కమిటీలను రూపొందిస్తామన్నారు. భవిష్యత్తులో ఈ కమిటీలు ప్రభుత్వ పథకాల అమలులో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. సమావేశంలో సీడ్ కార్పొరేషన్ జిల్లా మేనేజర్ ఎస్‌కే సింగ్, ప్రొడక్షన్ మేనేజర్ వెంకటేశ్వర్, విత్తనోత్పత్తి అధికారులు సదానందం, రుచిన, సీఎం దత్తత గ్రామాల స్పెషలాఫీసర్ రామచంద్రం, ఏవో రమేశ్, ఏఈవో శివకుమార్, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జేసీ పద్మాకర్

రక్తదానం మరొకరికి జీవనాధారం

• జేసీ పద్మాకర్

సిద్ధిపేట రూరల్ : రక్తదానం చేయడం వల్ల మరో ప్రాణానికి జీవనాధారం అవుతుందని జిల్లా సంయుక్త కలెక్టర్ పద్మాకర్ అన్నారు. సిద్ధిపేటలోని ఆంధ్రాబ్యాంకు గ్రామీణ ఉపాధి శిక్షణ కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని జేసీ పద్మాకర్ ప్రారంభించి మాట్లాడారు. ప్రతి మనిషి ఏడాదిలో నాలుగు సార్లు రక్తదానం చేయవచ్చని తెలిపారు. రక్తం ఇవ్వడం వల్ల దాత సంపూర్ణ ఆరోగ్యాన్ని కలిగి ఉంటాడన్నారు. పద్దెనిమిది సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరూ రక్తం ఇచ్చేందుకు అర్హులన్నారు. ఆంధ్రాబ్యాంకు వ్యాపార దృక్పథంతో పాటూ నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఆంధ్రాబ్యాంకు శిక్షణ కేంద్రం ద్వారా ఇప్పటి వరకు 1001 మందికి శిక్షణ ఇచ్చినట్లు బ్యాంకు జోనల్ చైర్మన్ నాంచారయ్య తెలిపారు. జిల్లాలో శిక్షణ కేంద్రం ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. ప్రజలకు అత్యవసర సమయాల్లో రక్తాన్ని అందించేందుకే యువత ముందుకు రావాలని సిద్ధిపేట జిల్లా బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాంమోహన్ సూచించారు. ఆంధ్రాబ్యాంకు శిక్షణ కేంద్రం ద్వారా 30 యూనిట్లు లభించటం సంతోషకరమని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆంధ్రా బ్యాంక్ చీఫ్ మేనేజర్ చంద్రశేఖర్, ప్రశాంత్‌నగర్ ఆంధ్రాభ్యాంక్ మేనేజర్ రాజశేఖర్, శిక్షణ సంస్థ డైరెక్టర్ రాజు, కో-ఆర్డినేటర్ విజయ్‌కుమార్, బ్లడ్ బ్యాంక్ సిబ్బంది కనకచంద్రం, ఆంజనేయులు, శ్రీనివాస్ పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న యువకుడితో బ్యాంక్ అధికారులు

రైతన్నకు జీఎస్టీ ఊరట

• కొత్త ధరలతో అందుబాటులోకి వచ్చిన ఎరువులు
• జీఎస్టీ మినహాయింపుతో తగ్గిన భారం
• నూతన ఎమ్మార్పీతో మార్కెట్‌లో విక్రయం
• ఆనందం వ్యక్తం చేస్తున్న జిల్లా యంత్రాంగం

గజ్వేల్: వస్తుసేవల పన్ను ప్రభావంతో ఎరువుల ధరలు కొంతమేరకు తగ్గాయి. దీంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. జీఎస్టీ అమల్లోకి రాకముందు ఎరువులపై పన్నెండు శాతం పన్నును నిర్ణయించారు. ఈ నేపథ్యంలో అన్నదాతల ఆగ్రహాన్ని చవిచూసిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 5 శాతానికే జీఎస్టీని పరిమితం చేశాయి. అనేక పరిణామాల మధ్య జీఎస్టీ మండలి దానిని 5 శాతానికి పరిమితం చేసింది. దీంతో గతంలో ఎరువుల ధరలతో పోల్చుకుంటే ఒక శాతం తగ్గింది. వాస్తవానికి

ఈ నెలాఖరు వరకు పాతస్టాకునే వ్యాపారులు విక్రయించారు. ఇటీవల నూతన ఎమ్మార్పీ ధరలతో ఎరువులను కొన్ని పరిశ్రమలు సరఫరా చేశారు. ఫలితంగా ఒక్కో బస్తాపై మూడు నుంచి 12 రూపాయల వరకు ధర తగ్గింది. మొత్తం మీద జీఎస్టీ



జీఎస్టీ మినహాయింపుతో ఎరువుల ధరలు కొంతమేర తగ్గాయి. గతంలో ఎరువులపై 5 శాతం వ్యాట్, ఒక శాతం ఎక్సైజ్ డ్యూటీతో కలిపి మొత్తం 6 శాతం పన్ను చెల్లించాల్సి వచ్చేది. మొదట జీఎస్టీ అమల్లోకి రాకముందు ఎరువులపై 12 శాతం పన్ను ను నిర్ణయించారు. ఈ నేపథ్యంలో అన్నదాతల ఆందోళనతో జీఎస్టీ మండలి పన్నును 5 శాతానికి పరిమితం చేసింది. దీంతో గతంతో పోలిస్తే ఎరువులు ధరలు తగ్గాయి. ప్రస్తుతం ఎమ్మార్పీకే ఎరువులు లభిస్తుండడంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ప్రభావంతో వరితో పాటు ఆయా పంటలు సాగుచేసే రైతులకు ఒక శాతం ఊరట లభించింది. జీఎస్టీ ప్రభావంతో ఎరువుల ధరలు కొంతమేర తగ్గినా ప్రస్తుత పరిశ్రమలు ఎమ్మార్పీ కంటే తక్కువ ధరలకే డీలర్లకు సరఫరా చేస్తున్నారు. మూడేళ్లతో పోల్చుకుంటే ఈ సంవత్సరం ఆయా మండలాల్లో సాగు విస్తీర్ణం పెరిగింది. అయితే పరిశ్రమలు మాత్రం ఎప్పటికప్పుడు విస్తీర్ణానికి తగ్గట్టుగా ఎరువులను ఉత్పత్తి చేస్తున్నాయి. దీంతో భారీగా నిల్వలు పెరిగిపోయాయి. ఇటీవల వరకు పాతస్టాకునే విక్రయించారు.

ఎరువు పేరు	పాతధర	ప్రస్తుత ధర (రూపాయల్లో)
యూరియా	298	295
28.28	1134	1122
పొటాష్	577	575
20.20	882	873
డీఏపీ	1127	1081
14.35.14	1137	1122
పాస్పేట్	361	358

ధరలు తగ్గినందుకు ఆనందంగా ఉంది

- పిట్ల బాలయ్య, రైతు, జాలిగామ



ఎరువుల ధరలు తగ్గినందుకు ఆనందంగా ఉంది. గతంలో ఎరువులు దొరికేవు కాదు. కానీ ప్రస్తుతం ఎరువులు అందుబాటులోనే ఉన్నప్పటికీ అధిక ధరలతో ఇబ్బందులు పడుతున్నాం. జీఎస్టీ అమలుతో ఎరువుల ధరలు కొంత తగ్గడం సంతోషమే అయినా పంటల పెట్టుబడి వ్యయం ఎక్కువవుతున్నది. కాబట్టి ఎరువుల ధరలు మరింత తగ్గాల్సి ఉంది.

మరింత తగ్గించాలి

- వెంకటేశ్, రైతు, మజీద్‌పల్లి



ఎరువుల ధరలు మరింత తగ్గించాలి. రైతులపై సర్కారు ప్రత్యేక ప్రేమ సూపిస్తేనే దేశం బాగుంటది. ఇప్పటికైతే ఈ తగ్గింపు సంతోషమే. రెండేళ్ల క్రితం వరకు ఎరువులు దొరకకపోవు. ఇప్పుడైతే మాకు మంచిగానే దొరుకుతున్నయి.

జీఎస్టీతో రైతులకు లాభమే

- కర్రోళ్ల సత్యం, వ్యాపారి



జీఎస్టీతో రైతులకు లాభమే. గతంలో కంటే మొత్తంగా రెండు శాతం ఎరువుల ధరలు తగ్గాయి. రైతులైతే సంతోషాన్నే వ్యక్తం చేస్తున్నారు. జీఎస్టీ ప్రవేశపెట్టిన సమయంలో 12శాతం జీఎస్టీ అన్నప్పుడు రైతులు ఆందోళనలో పడ్డారు. కానీ ప్రస్తుత తగ్గింపుతో ఆనందంలో మునిగిపోయారు.

రింగ్‌రోడ్డు పనులను జెట్‌స్పీడ్‌తో చేయాలి

• రెండు నెలల్లో భూసేకరణ పూర్తి చేయండి
• రేడియల్ రోడ్ల విస్తరణ పనులను వేగవంతం చేయాలి
• 31న బాధితులతో ఆర్డీవో కార్యాలయంలో మాట్లాడుదాం
• అధికారులకు మెదక్ పార్లమెంట్ సభ్యుడు కొత్త ప్రభాకర్‌రెడ్డి సూచన
• గజ్వేల్ ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌజ్‌లో ఆర్‌అండ్‌బీ ఈఎన్‌సీ, అధికారులతో సమీక్ష



గజ్వేల్ గెస్ట్‌హౌజ్‌లో సమీక్ష నిర్వహిస్తున్న ఎంపీ కేపీఆర్, పక్కన నర్సారెడ్డి, ఈఎన్‌సీ రవీందర్‌రావు

గజ్వేల్: సీఎం కేసీఆర్ మొట్టమొదటి హామీ అయిన గజ్వేల్ రింగురోడ్డు పనులను జెట్‌స్పీడ్‌తో చేపట్టాలని అధికారులకు మెదక్ పార్లమెంట్ సభ్యుడు కొత్త ప్రభాకర్‌రెడ్డి సూచించారు. గజ్వేల్‌లోని ఆర్ అండ్‌బీ అతిథి గృహంలో మంగళవారం రాష్ట్ర రోడ్డు కార్పొరేషన్ చైర్మన్ తూంకుంట నర్సారెడ్డి, ఆర్‌అండ్‌బీ ఈఎన్‌సీ రవీందర్‌రావు, హౌజింగ్ కార్పొరేషన్ చైర్మన్ మడుపు భూంరెడ్డి, గడ ప్రత్యేకాధికారి హనుమంతరావు, జీపీఎస్పీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్‌తో కలసి ఆయన నియోజకవర్గంలోని రోడ్ల ప్రగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పలురోడ్ల అభివృద్ధి పనులను గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ పనులను మరింత వేగవంతం చేయాలని ఆదేశించారు. కాగా రింగ్‌రోడ్డు భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆర్డీవో విజయేం దర్‌రెడ్డికి సూచించారు. రింగ్‌రోడ్డులో వక్ఫ్ భూమి ఉందని, మరో 7కిలోమీటర్ల భూసేకరణ పూర్తిచేయాల్సి ఉందని ఆర్డీవో బదులిచ్చారు. రెండు నెలల్లో భూసేకరణ ప్రక్రియను పూర్తిచేసి, ఆర్‌అండ్‌బీ అప్పగిస్తామన్నారు. రేడియల్ రోడ్ల విస్తరణ పనులను వేగవంతం చేయాలని, పిడిచెడ్ రోడ్డులో భూసేకరణ పూర్తయినందున ఆ రోడ్డు పనులను ప్రారంభించాలని ఎంపీ సూచించారు. ఈ నెల 31న రేడియల్ రోడ్లలో ఇళ్లు, భూములు కోల్పోవడంతో పాటు, రింగురోడ్డులో భూములు కోల్పోతున్న నిర్వాసితులతో ఆర్డీవో కార్యాలయంలో సమావేశం నిర్వహించి, వారికి నష్టపరిహారం అందజేద్దామన్నారు.

ప్రభుత్వాసుపత్రిలో లేబర్ రూంను ప్రారంభించిన ఎంపీ

గజ్వేల్‌లోని ప్రభుత్వాసుపత్రిలో లేబర్ రూంను మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధమ స్థానంలో ఉన్న ఆసుపత్రి రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలవడం అభినందనీయమన్నారు. ఆయనవెంట ఆర్డీసీ చైర్మన్ తూంకుంట నర్సారెడ్డి, గడ ప్రత్యేకాధికారి హనుమంతరావు, జీపీఎస్పీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, హైరిస్క్ కేంద్రం ప్రత్యేకాధికారి కాశీనాథ్, సీనియర్ నాయకులు ఊడెం కృష్ణారెడ్డి, నాయినియాదగిరి, సాజిద్, వైస్‌చైర్‌పర్సన్ అరుణ, పులిబాల్‌చంద్రం, గోపాల్‌రెడ్డి, పండరి రవీందర్‌రావు తదితరులున్నారు.

సినిమాలు

సిద్దిపేట

బాలాజీ	అర్జున్‌రెడ్డి
సీతారామాంజనేయ	ఫిదా
శ్రీనివాస	జయ జానకి నాయక
వెంకటేశ్వర	నేనే రాజు నేనే మంత్రి

దుబ్బాక

శ్రీనివాస	జయ జానకి నాయక

చేర్యాల

బాలాజీ	లై



పేదలకు వరంగా కల్యాణలక్ష్మి పథకం

• రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, దుబ్బాక ఎమ్మెల్యే రామలింగారెడ్డి

దుబ్బాక: పేదలకు వరం కల్యాణలక్ష్మి పథకమని రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, స్థానిక ఎమ్మెల్యే సోలిపేట రామలింగారెడ్డి అన్నారు. మంగళవారం దుబ్బాకలో రెవెన్యూ కార్యాలయం వద్ద ఆయన లబ్ధిదారు లకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేసి మాట్లాడారు. పేదల కష్టాలను దృష్టిలో ఉంచుకుని సీఎం కేసీఆర్ కల్యాణలక్ష్మి పథకం ద్వారా రూ.71వేల 116 అందిస్తున్నారన్నారు. రాజకీయ ప్రమేయం లేకుండా ఈ పథకాన్ని అమలుచేస్తున్నామన్నారు. కల్యాణ లక్ష్మి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అంతకు ముందు మండలంలోని చిట్టాపూర్‌లోని డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ర్యాకం పద్మ, ఏఎంసీ చైర్మన్ ఎల్లారెడ్డి, ఆత్మకమిటీ చైర్మన్ సంజీవరెడ్డి, తహసీల్దారు అరుణ, శ్రీరాములు, ఆయా గ్రామా ల సర్పంచులు, ఎంపీటీసీలు, టీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల అందజేత

మిరుదొడ్డి: మిరుదొడ్డి, మల్లుపల్లి గ్రామాలకు చెందిన శ్రీశైలం, రమేష్‌లకు మంగళవారం సిద్దిపేటలోని తన నివాసంలో ఎమ్మెల్యే రామలింగారెడ్డి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. అయితే మండలంలోని వీరారెడ్డిపల్లి గ్రామచావిడి వద్ద సీసీ రోడ్డును నిర్మించాలని గ్రామస్తులు ఎమ్మెల్యేకు విన్నవించారు. బతుకమ్మ పండగలోపు సీసీ రోడ్డును నిర్మిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ బాపురెడ్డి, ఎంపీపీ ఉపాధ్యక్షుడు బాల్‌రాజ్, టీఆర్ఎస్ మండలపార్టీ అధ్యక్షుడు వెంకటరెడ్డి, రమేష్, నర్సయ్య, రాములు, మల్లేశం, జయరాములు, మల్లేశం, నర్సింహ్మారెడ్డి, రాజిరెడ్డి పాల్గొన్నారు.

ఇంట్రావిలేజ్ నిర్వాహకుల నిలదీత


నిర్వాహకులను నిలదీస్తున్న ఆకునూరు గ్రామస్తులు

చేర్యాల: ఇంట్రావిలేజ్ పైప్‌లైన్ పనులు అస్తవ్యస్తంగా పూర్తిచేసి నీళ్లు రాకుండా చేశారని ఆరోపిస్తూ మండలంలోని ఆకునూరు గ్రామస్థులు బుధవారం మిషన్ భగీరథ సిబ్బందిని నిలదీశారు. గ్రామంలో చేపట్టిన పనుల కారణంగా గ్రామ పంచాయతీ పైప్‌లైన్ ధ్వంసమై నీళ్లు రావడం లేదన్నారు. మిషన్ భగీరథ పైప్‌లైన్ వేసి నెలలు గడుస్తున్నా నల్లాలు బిగించకపోవడం తగదని ఆగ్రహం వ్యక్తంచేశారు. నీళ్లు రాకపోవడంతో తంటాలుపడి దూర ప్రాంతం నుంచి తెచ్చుకొంటున్నామన్నారు. అధికారులు స్పందించి తమ సమస్యను పరిష్కరించాలని వారు కోరారు. దీంతో సంబంధిత సిబ్బంది త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

'షరతులు లేకుండా ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి'

చేర్యాల: వృత్తి నిర్వహణలో మృతిచెందిన గీత కార్మిక కుటుంబాలకు షరతులు లేకుండా రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కల్లు గీత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బండకింది అరుణ్‌కుమార్ కోరారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆసరా పింఛన్ పొందుతున్న వారికి ఎక్స్‌గ్రేషియా వర్తించదని పేర్కొనడం గీత కార్మికుల పాలిట శాపంగా మారిందన్నారు. ఎక్స్‌గ్రేషియా విషయంలో ప్రభుత్వం లేనిపోని నిబంధనలు పెట్టడం సబబుకాదన్నారు. ఈ నిబంధనలతో పింఛన్లు రాక, ఎక్స్‌గ్రేషియా అందక ఎంతో మంది ఇబ్బందులుపడుతున్నారన్నారు. ఈ విషయమై ప్రభుత్వం పునరాలోచించి నిబంధన ఎత్తివేయాలని కోరారు. సమావేశంలో నాయకులు మేరిండ్ల శ్రీనివాస్, బండకింది భిక్షపతి, గుడాల కనకయ్య, నెరెల్ల నరేశ్, వెలికట్ట నర్సింహులు పాల్గొన్నారు

ఘనంగా అంతర్జాతీయ క్రీడాదినోత్సవం

చేర్యాల: అంతర్జాతీయ క్రీడా దినోత్సవాన్ని మంగళవారం చేర్యాలలో స్పోర్ట్స్ క్లబ్, వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో స్పోర్ట్స్ క్లబ్ ప్రతినిధులు మొక్కలను నాటారు. కార్యక్రమంలో నిమ్మ రాజీవ్, పిల్లి ఆనంద్, బుచ్చి రాములు, విమల్, రాజు, నరేష్, మక్బూల్, సంతోశ్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు. పీఈటీలు తెలంగాణ తల్లి విగ్రహ ఆవరణలో హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో చంద శ్రీకాంత్, గంగారం, కనుకరాజు, సన్నీ, సంతోశ్, శ్రీనివాస్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

దుబ్బాకలో

దుబ్బాక: క్రీడా దినోత్సవం సందర్భంగా మంగళవారం దుబ్బాక ఎస్‌వీ బీపీఈడీ కళాశాల విద్యార్థులు చేపట్టిన 5కే రన్‌ను దుబ్బాక ఎస్ఐ సుభాష్‌గౌడ్ జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో అధ్యాపకులు గడ్డం కుమార్, తొగుట రవీందర్, రంజిత్‌గౌడ్, శ్రీనివాస్, శేఖర్, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

కొమురవెల్లి మండల రెడ్డి ఐక్య వేదిక ఎన్నిక

చేర్యాల: తెలంగాణ రెడ్డి ఐక్య వేదిక కొమురవెల్లి మండల అధ్యక్షుడిగా మర్రిముచ్చాలకు చెందిన వంగా కృష్ణారెడ్డి, కార్యదర్శిగా జోగ్రిగల మల్లారెడ్డి, సమన్వయకర్తగా సద్ది కృష్ణారెడ్డి, కోశాధికారిగా నిమ్మ దామోదర్‌రెడ్డి, యూత్ మండల కన్వీనర్‌గా బొంగు తిరుపతిరెడ్డి, కో-ఆర్డినేటర్‌గా వంగ శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యుడిగా చెక్కల వెంకటరెడ్డి, మహిళా విభాగం జిల్లా బాధ్యులుగా వంగా రాణినర్సిరెడ్డిలను మంగళవారం ఎన్నుకున్నారు. కార్యక్రమంలో దండ్యాల లక్ష్మారెడ్డి, జిల్లా కన్వీనర్ పుర్మ రాంరెడ్డి, రాష్ట్ర కమిటీ సలహాదారు వంటేరు గోపాల్‌రెడ్డి, జిల్లా కో-ఆర్డినేటర్ సన్నాల మహిపాల్‌రెడ్డి, కో-కన్వీనర్ ఎడ్ల శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు టి.విజయభాస్కర్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, బొంగు రాంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, బద్దిపడిగ నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శంగా నిలుస్తున్న నేతాజీ యూత్ సభ్యులు

చేర్యాల: చేర్యాల అభయాంజనేయ స్వామి ఆలయ సమీపంలో నేతాజీ యూత్ అసోసియేషన్ సభ్యులు మూడేళ్లుగా వినాయక నవరాత్రోత్సవాల్లో మట్టి ప్రతిమలను ప్రతిష్ఠిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ముస్త్యాల గ్రామంలోనూ పలువురు యువకులు మట్టి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు.

బొక్కల ఫ్యాక్టరీని మూసేయండి

• చేర్యాల తహసీల్దారుకు గ్రామస్థుల వినతి

చేర్యాల టౌన్: దుర్గంధం వెదజల్లుతున్న బొక్కల ఫ్యాక్టరీని మూసివేయించాలని కోరుతూ మంగళవారం మండలంలోని చుంచనకోట గ్రామస్థులు చేర్యాల తహసీల్దారు విజయ్‌సాగర్‌కు వినతిపత్రం సమర్పించారు. గ్రామ ఉప సర్పంచ్ గొర్రె శ్రీనివాస్, స్థానికులు మాట్లాడుతూ, గ్రామ శివారులోని గుట్టల మధ్య నెలకొల్పిన ఫ్యాక్టరీలో పశువుల బొక్కలతో చూర్ణం తయారుచేస్తూ వ్యర్థాలను బయట పారేస్తుండటంతో దుర్గంధం వె దజల్లుతున్నదన్నారు. దీంతో ఊపిరి పీల్చుకోవడానికి కూడా ఇబ్బందులు పడుతున్నామన్నారు. చేర్యాల-చుంచనకోట దారి వెంబడి వెళ్లాలంటేనే జంకుతున్న పరిస్థితి నెలకొందన్నారు. ఎంతోమంది అనారోగ్యాలకు గురవుతున్నారని తెలిపారు. వాంతులు, విరేచనాలకు గురవుతున్నారన్నారు. ప్రాణాపాయం వాటిల్లకముందే బొక్కల ఫ్యాక్టరీని మూసివేయించాలని, లేకపోతే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.


తహసీల్దారుకు వినతిపత్రమిస్తున్న గ్రామస్థులు

ఎస్సీ కార్పొరేషన్ రుణాల లబ్ధిదారుల ఎంపిక వివరాలు

చేర్యాల: ఎస్సీ కార్పొరేషన్ రుణాల ఆన్‌లైన్ దరఖాస్తుదారుల నుంచి లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు ఈనెల31 నుంచి చేర్యాల, కొమురవెల్లి మండలాల్లో గ్రామ సభలు నిర్వహించనున్నట్లు చేర్యాల ఇన్‌చార్జి ఎంపీడీవో రాంప్రసాద్ మంగళవారం తెలిపారు. 31న తాడూరు, చిట్యాల, పోసానిపల్లి, కడవేరుగు, వేచరేణి, పోతిరెడ్డిపల్లి, కొమురవెల్లి, రాంసాగర్, దానంపల్లి, చుంచనకోట, వీరన్నపేట, సెప్టెంబర్ 1న చేర్యాల, పెద్దరాజుపేట, తపాస్‌పల్లి, ముస్త్యాల, 5న ఆకునూరు, రాంపూర్, గుర్జకుంట, దొమ్మాట, గురువన్నపేట, అయినాపూర్, కిష్టంపేట, గౌరాయపల్లి, మర్రిముచ్చాల, నాగపురి గ్రామాల్లో సభలు నిర్వహిస్తామన్నారు. గ్రామానికో ప్రత్యేకాధికారిని నియమించినట్లు తెలిపారు.

'బాధితులకు నష్టపరిహారమివ్వాలి'

దుబ్బాక: దుబ్బాక మండలంలోని అప్పనపల్లి నుంచి రాజక్కపేట శివారు వరకు నిర్మించతలపెట్టిన కాలువలో భూములను కోల్పోతున్న రైతులకు రూ.5లక్షల నష్టపరిహారం చెల్లించాలని రైతు పోరాట కమిటీ జిల్లా కన్వీనర్ భాస్కర్ డిమాండ్ చేశారు. మంగళవారం దుబ్బాక తహసీల్దారు అరుణకు రైతులు రాంరెడ్డి, మల్లేశం, రాజేశం, పర్వయ్య, కనకయ్య, అంజయ్య, చంద్రయ్యలతో కలిసి వినతి పత్రాన్ని అందజేశారు.

ఓపెన్‌టెన్త్ అడ్మిషన్లు ప్రారంభం

మిరుదొడ్డి: 2017-18 సంవత్సరానికి ఓపెన్ టెన్త్ అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని భూంపల్లి జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయుడు జగదీశ్వర్ మంగళవారం తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు వివరాలకు 9705282198 నంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

'సీపీఎస్ రద్దుకై పోరాటం'

దుబ్బాక: సీపీఎస్ విధానాన్ని అంతమొందించడమే పీఆర్టీయూ లక్ష్యమని సంస్థ జిల్లా అధ్యక్షుడు మల్లుగారి ఇంద్రసేనారెడ్డి అన్నారు. మంగళవారం ఆయన దుబ్బాకలో మాట్లాడారు. సెప్టెంబర్ 1న సామూహిక సెలవుకు పీఆర్టీయూ మద్దతు ఇస్తున్నదన్నారు. ఆయనవెంట మండలాధ్యక్షుడు రాంచంద్ర ఉన్నారు. కాగా, ఇంద్రసేనారెడ్డిని దర్మారం జీపీఎస్ జడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు సన్మానించారు.

'ఎమ్మెల్యేను విమర్శించే స్థాయి లేదు'

మిరుదొడ్డి: దుబ్బాక నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్న ఎమ్మెల్యే సోలిపేట రామలింగారెడ్డిని విమర్శించే స్థాయి బీజేపీ నేత రఘునందన్‌రావుకు ఏఎంసీ చైర్మన్ బాపురెడ్డి, టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వెంకటరెడ్డి, పంజాల శ్రీనివాస్‌గౌడ్ మంగళవారం మండిపడ్డారు.

ఘనంగా తెలుగు భాషాదినోత్సవం

చేర్యాల: తెలుగు భాషాదినోత్సవ వేడుకలను మంగళవారం చేర్యాల, కొమురవెల్లి మండలాల్లో ఘనంగా నిర్వహించారు. మండలంలోని కొత్తదొమ్మాట యూపీఎస్‌లో ప్రధానోపాధ్యాయుడు సదానందం గిడుగు రామమూర్తి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యార్థులు ఆదికవి నన్నయ్య నుంచి ఆధునిక కవి సినారె వరకు జరిగిన భాషాపరిణామ ప్రక్రియలను దృశ్య రూపకంగా ప్రదర్శించారు. కాగా, మాతృ భాషను విడనాడకూడదని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జి.సర్వేశ్వర్‌రెడ్డి అన్నారు. కళాశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో గిడుగు రామమూర్తికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారి శ్రీధర్, అధ్యాపకులు స్వప్న, విద్యాసాగర్, శ్యామ్‌సుందర్, ఆదిలక్ష్మి, పరశురాములు, శ్రీనివాసులు, రవి, సుస్మిత, కవిత తదితరులు పాల్గొన్నారు.

బైరాన్‌పల్లి సభకు తరలిరావాలి

• బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అంకుగారి శశిధర్‌రెడ్డి

చేర్యాల: తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని కోరుతూ సెప్టెంబర్4న మద్దూరు మండలం బైరాన్‌పల్లిలో నిర్వహించనున్న బహిరంగ సభకు ప్రజలు తరలిరావాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అంకుగారి శశిధర్‌రెడ్డి కోరారు. మంగళవారం చేర్యాల మండలంలోని దానంపల్లి, చిట్యాల, తాడూరు, వేచరేణి, గుర్జకుంట, దొమ్మాట, ఆకునూరు, రాంపూర్, కడవేరుగు, పోతిరెడ్డిపల్లి, నాగపురి గ్రామాల్లో కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ విమోచనం కోసం చేర్యాల, మద్దూరు మండలాల్లో జరిగిన వీరోచిత పోరాటాన్ని భావితరాలకు అందించేందుకు పాఠ్య పుస్తకాల్లో చేర్చాలని డి మాండ్ చేశారు. ఈ విషయమై బీజేపీ అధ్యక్షుడు లక్ష్మణ్ చేపట్టిన బస్సుయాత్ర బైరాన్‌పల్లికి సెప్టెంబర్ 4న చేరుకుంటున్న సందర్భంగా ఏర్పాటుచేయనున్న సభను జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో పార్టీ మండలాధ్యక్షుడు నర్ర మహేందర్‌రెడ్డి, ఎంపీటీసీ కోట వెంకటస్వామి, నాయకులు బర్ల శ్రీనివాస్, గంగారబోయిన కొండయ్య, సత్తుల యాదగిరి, తౌట అశోక్, శ్రీనివాస్, వాసుదేవరెడ్డి, లింగం పాల్గొన్నారు.

ఉచితంగా బస్‌పాస్‌ల పంపిణీ

మిరుదొడ్డి: మిరుదొడ్డి మోడల్ స్కూల్‌లోని పేద కుటుంబానికి చెందిన విద్యార్థులకు మంగళవారం ప్రిన్సిపాల్ భారతి సమక్షంలో తన సొంత ఖర్చులతో నర్సింలు ఉచితంగా బస్‌పాస్‌లను అందించారు.

విద్యార్థులకు స్కూల్‌బ్యాగుల వితరణ

చేర్యాల: మండలంలోని పోతిరెడిపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు చేర్యాల ఛాంబర్ ఆఫ్ కామర్స్ గౌరవాధ్యక్షుడు వంగపల్లి వెంకటేశం స్కూల్ బ్యాగులు, డిక్షనరీ, స్టేషనరీని మంగళవారం వితరణగా అందించారు. కార్యక్రమంలో హెచ్ఎం ముస్త్యాల పుష్ప, సర్పంచ్ కొక్కొండ యాదగిరి, ఉపాధ్యాయులు కె.వేణుగోపాలచారి, ఎం.మల్లేశం, బి.అజయ్‌కుమార్, సీహెచ్.ఉగ్రరాములు పాల్గొన్నారు.

'రోడ్డుపై ఏర్పడిన గుంతలను పూడ్చాలి'

చేర్యాల: చేర్యాల మండల కేంద్రంలో జనగామ-సిద్దిపేట ప్రధాన రహదారిపై ఏర్పడిన గుంతలను పూడ్చివేయాలని కాంగ్రెస్ నాయకులు చెవిటి లింగం, ముస్త్యాల యాదగిరి కోరారు. రోడ్డుపై గుంతలుపడినా మరమ్మతు చేపట్టకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. అధికారులు స్పందించి వెంటనే గుంతలను పూడ్చాలని కోరారు.

జిల్లాకు రూ.90 కోట్ల స్త్రీనిధి రుణాలు లక్ష్యం

● స్త్రీనిధి జోనల్ మేనేజర్ సంజీవరెడ్డి, రీజినల్ మేనేజర్ రవికుమార్

సిద్దిపేట అర్బన్: సిద్దిపేట జిల్లాకు రూ.90 కోట్లు స్త్రీనిధి రుణాలను కల్పించడమే లక్ష్యమని స్త్రీ నిధి జోనల్ మేనేజర్ సంజీవరెడ్డి, రీజినల్ మేనేజర్ రవికుమార్ అన్నారు. మంగళవారం సిద్దిపేటలోని ఐకేపీ భవన్‌లో నిర్వహించిన స్త్రీనిధి లోన్ గ్రేడింగ్ సమావేశంలో వారు మాట్లాడారు. గతంలో ఇచ్చిన రుణాల రికవరీ, బుక్స్ మెయింటనెన్స్, సమావేశాల తీరు పరిశీలించడమే సమావేశ ముఖ్య ఉద్దేశమన్నారు. అన్ని విషయాలను పరిగణలోకి తీసుకొని ఏబీసీడీలు గా గ్రేడ్‌లను విభజిస్తామని తెలిపారు. ఏ, బీ గ్రేడ్ వారికి 40 నుంచి 50 లక్షల లోన్ ఇస్తామన్నారు. ఒక సారి లోన్ ఇచ్చిన తర్వాత ఆ గ్రూప్ సభ్యులు రుణా లు చెల్లించే తీరు, హాజరు శాతం, నిర్వహించే సమావేశాలు, రిజిస్టర్ మెయింటనెన్స్‌ను బట్టి తర్వాతి కాలం లో లోన్ పెంచి ఇవ్వడానికి అవకాశం ఉంటుందన్నారు. గ్రామ సంఘాల్లోని ఒక్కో గ్రూప్‌లో ఆరు మందికి పర్సనల్ లోన్, ఇద్దరికి బిజినెస్ లోన్ ఇస్తా మని తెలిపారు. పర్సనల్ లోన్ వారికి ఒక్కొక్కరికి రే.25 వేలు, బిజినెస్ లోన్ లక్ష రూపాయల వరకు ఇచ్చే అవకాశముంటుందున్నారు. అర్హులకే లోన్ మంజూరుచేస్తామన్నారు. సమావేశంలో 142 గ్రామ సంఘాలు పాల్గొన్నాయి. సమావేశంలో ఏపీఎం శ్రీని వాస్, వీవోలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రీజినల్ మేనేజర్ రవికుమార్, కలెక్టరేట్ వద్ద బతుకమ్మ ఆడుతున్న ఉద్యోగులు

బతుకమ్మ ఆడి 'ఐకేపీ' నిరసన

సిద్దిపేట రూరల్: ఇందిరా క్రాంతి పథకంలో పనిచేస్తున్న ఆఫీసు సిబ్బంది చేపట్టిన నిరసన మంగళవారం నాటికి 14వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా మండల అకౌంటెంట్ అండ్ కంప్యూటర్ ఆపరేటర్ల ఉద్యోగుల సంక్షేమ సంఘం సిద్దిపేట జిల్లా అధ్యక్షురాలు జ్యోతి ఆధ్వర్యంలో ఉద్యోగులు మంగళవారం బతుకమ్మ ఆడి నిరసన తెలిపారు. సెర్ప్ హెచ్ఆర్ పాలసీ వర్తింపజేయాలని, కంప్యూటర్, అకౌంటెంట్లకు రూ.18,500, అటెండర్లకు రూ.10500 కనీస వేతనంగా ఇవ్వాలని, ఆరోగ్య, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్‌చేశారు. మహిళా ఉద్యోగులకు ప్రసూతి సెలవులు మంజూరు చేయాలన్నారు. స్త్రీనిధి ద్వారా వచ్చే లాభాల్లో తమకు కూడా వాటా వర్తించే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి భాస్కర్, కోశాధికారి బాలనారాయణ, సభ్యులు శ్రీనివాస్ పాల్గొన్నారు.

'గిరిజనులకు ప్రాధాన్యమివ్వాలి'

సిద్దిపేట రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న రైతు సమన్వయ సంఘాల్లో దళిత గిరిజనులకు 20 శాతం ప్రాధాన్యత కల్పించాలని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ డిమాండ్ చేశారు. మంగళవారం డీబీఆర్‌సీ ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ భవన్‌లో ఏర్పాటుచేసిన సదస్సులో ఆయన మాట్లాడారు. భూమి లేని దళితులకు భూ పంపిణీ చేసి, విత్తనాలు, ఆర్థిక సహాయమందించాలని కోరారు. సదస్సులో డీబీఆర్‌సీ రాష్ట్ర కో-ఆర్డినేటర్ రఘుపతిరావు, జిల్లా అధ్యక్షుడు ముత్యాల భూపాల్, సీసీసీ జిల్లా కో-ఆర్డినేటర్ లక్ష్మి, సూరన్న, జ్యోతి, శ్వేత, కోదాది రవి, సురేశ్, శ్రీనివాస్, ఏగోండ స్వామి పాల్గొన్నారు.

ఎస్సీ యువతకు ఇంటర్వ్యూలు

చిన్నకోడూరు: చిన్నకోడూరు మండలంలో వివిధ పథకాల కింద రుణాల మంజూరుకు దరఖాస్తు చేసుకున్న ఎస్సీ యువతకు మండలంలోని యూబీఐ, ఏపీజీవీబీ, ఆంధ్రాబ్యాంక్‌ల ఆధ్వర్యంలో బ్యాంకు మేనేజర్లు, ఎంపీడీవో జాఫర్‌ఖాన్ మంగళవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు.

ఏఐఎస్ఎఫ్ సభ్యత్వ నమోదు

సిద్దిపేట అర్బన్: ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పవిత్ర జూనియర్ కళాశాలలో మంగళవారం సభ్యత్వ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ కన్వీనర్ బోనాలవర్మ, నాయకులు నవీన్, నాగరాజు, సుధాకర్, పవన్, రాజు, రాకేశ్, శ్రీకాంత్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ప్రతిభ, ఎస్ఎంఎస్, ప్రగతి జూనియర్ కళాశాలలో మంగళవారం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు దాసరి ప్రశాంత్, నాయకులు మధు, కరుణాకర్, భరత్, రాజు, షారుఖ్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

1న సర్వసభ్య సమావేశం

చిన్నకోడూరు: చిన్నకోడూరు మండల సాధారణ సర్వసభ్య సమావేశం 1న ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో జాఫర్‌ఖాన్ తెలిపారు. సమవేశానికి అధికారులు, ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

లోన్ల రికవరీని త్వరగా పూర్తి చేయాలి

● మునిసిపల్ కమిషనర్ కేవీ రమణాచారి

సిద్దిపేట మునిసిపాలిటీ: మహిళా సమాఖ్య సంఘాల లోన్ల రికవరీ త్వరగా పూర్తిచేయాలని మునిసిపల్ కమిషనర్, మెప్మా పీడీ కేవీ రమణాచారి సూచించారు. మంగళవారం పలు బ్యాంకర్ల, మెప్మా సభ్యులతో మునిసిపల్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2017-18 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి టార్గెట్లను పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్‌బీహెచ్ మేనేజర్ వంశీమోహన్, బ్యాంకుల ఫీల్డు ఆఫీసర్లు, మెప్మా ఏడీఎంసీ సంతోషి, టీఎంసీ సాయికృష్ణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



బ్యాంకర్ల సమావేశంలో మాట్లాడుతున్న రమణాచారి

పరిశుభ్రతను పాటించాలి

ప్రజలు పరిశుభ్రతను పాటించాలని మునిసిపల్ కమిషనర్ రమణచారి సూచించారు. మంగళవారం మునిసిపల్ సిబ్బందితో కలిసి ఆయన వేములవాడ కమాన్ నుంచి కరీంనగర్ చౌరస్తా వరకు శ్రమదానం నిర్వహించారు. దాదాపు 50 మంది సిబ్బంది ఇందులో పాల్గొన్నారు.

సెప్టెంబరు 1ని విద్రోహ దినంగా ప్రకటించాలి

● యూటీఎఫ్ నాయకులు

నంగునూరు: సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్‌తో సెప్టెంబర్ 1ని విద్రోహ దినంగా ప్రకటించాలని యూటీఎఫ్ నాయకులన్నారు. దీనికి సంబంధించిన వాల్‌పోస్టరును మంగళవారం యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఎంఈవో దేశిరెడ్డి అవిష్కరించారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి యాదగిరి మాట్లాడుతూ, సీపీఎస్ విధానంతో రాష్ట్రంలో లక్ష 20 వేల ఉద్యోగులు మానసిక వేదనకు గురవుతున్నారన్నారు. పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరించాలని ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో సిద్దిపేట కలెక్టరేట్ వద్ద 1న తలపెట్టిన మహా ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు డి.నర్సింలు, జి.సురేందర్‌రెడ్డి, టీపీటీఎఫ్ మండల నాయకులు పద్మారెడ్డి, నరేష్, నరేష్‌కుమార్, శ్రీనివాస్, చంద్రశేఖర్, గోవర్ధన్, రాజు, రమేశ్, నాగరాజు, కొటేశ్ పాల్గొన్నారు.


పోస్టరును ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు

ఉద్యమానికి పీఆర్టీయూ మద్దతు

సిద్దిపేట రూరల్: సీపీఎస్‌ను రద్దు చేయాలని ఉద్యోగ ఉపాధ్యాయులు చేపడుతున్న ఉద్యమానికి పీఆర్టీయూ పూర్తి మద్దతునిస్తున్నదని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు మల్లుగారి ఇంద్రసేనారెడ్డి, ప్రధాన కార్యదర్శి కొత్త నరెందర్‌రెడ్డి తెలిపారు. సిద్దిపేటలో మంగళవారం వారు మాట్లాడారు. నూతన పింఛన్ విధానంతో ఉద్యోగులు ఇబ్బందులెదుర్కుంటు న్నారన్నారు. సెప్టెంబర్ 1న సామూహిక సెలవు పిలుపునకు సుముఖత వ్యక్తంచేస్తున్నామన్నారు. వారి వెంట నాయకులు నారాయణరెడ్డి, ఆస లక్ష్మణ్, పి.రవీందర్‌రెడ్డి, నిమ్మ శ్రీనివాస్‌రెడ్డి, పి.మల్లిఖార్జున్‌రెడ్డి తదితరులున్నారు.

వినాయక నిమజ్జనానికి బందోబస్తు ఏర్పాట్లు


సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి సీపీ చంద్రశేఖర్‌రెడ్డి

సిద్దిపేట క్రైం: జిల్లా కేంద్రంలో వినాయక నిమజ్జనానికి గట్టి బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఇన్‌చార్జి పోలీసు కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం కార్యాలయంలో పోలీసు అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఏర్పాట్ల గురించి పలు సూచనలు చేశారు. సమావేశంలో ఏసీపీ నర్సింహారెడ్డి, వన్ టౌన్ సీఐ నందీశ్వర్, రూరల్ సీఐ సైదులు, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'ఫుట్ ఓవర్ బ్రిడ్జి'లను పరిశీలించిన చైర్మన్


పనులను పరిశీలిస్తున్న మునిసిపల్ చైర్మన్, తదితరులు

సిద్దిపేట కల్చరల్: సిద్దిపేట పట్టణంలో నిర్మించబోయే ఫుట్ ఓవర్ బ్రిడ్జిల పనులను మునిసిపల్ చైర్మన్ రాజనర్సు మంగళవారం పరిశీలించారు. మంత్రి హరీశ్‌రావు కృషితో వీటిని పట్టణంలో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

అభివృద్ధిని చూసి ఓర్వలేకనే విమర్శలు

● టీఆర్ఎస్ సిద్దిపేట మండల ఉపాధ్యక్షుడు రాజుచారి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న చెన్నోజి రాజుచారి

సిద్దిపేట రూరల్: టీఆర్ఎస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్నాయని టీఆర్ఎస్ సిద్దిపేట మండల ఉపాధ్యక్షుడు చెన్నోజి రాజుచారి విమర్శించారు. మంగళవారం సిద్దిపేటలో ఆయన మాట్లాడారు. బంగారు తెలంగాణ నిర్మాణంలో భాగంగా రిజర్వాయర్లను నిర్మించి కోటి ఎకరాలకు సాగు నీరు అందించుటకు సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు కృషి చేస్తున్నారన్నారు. ఆయనవెంట కట్ట శ్రీనివాసచారి, పిన్నోజు బాలక్రిష్ణచారి, నాగరాజుచారి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఎంఆర్ టీకాల కార్యక్రమం


విద్యార్థులకు ఎంఆర్ టీకాలను వేస్తున్న ఆరోగ్యశాఖ సిబ్బంది

సిద్దిపేట కల్చరల్: మంగళవారం కాకతీయ పాఠశాలలో ఆర్యోగశాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఎంఆర్ టీకాలను వేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జగ్గు మల్లారెడ్డి, జిల్లా పబ్లిక్ హెల్త్ ఆఫీసర్ యేసుమేరి, జిల్లా స్టాటికల్ ఆఫీసర్ పిటర్‌సన్ పాల్గొన్నారు.



హుస్నాబాద్‌లో సినిమా
వెంకటేశ్వర ఏ/సీ
నేనే రాజు నేనే మంత్రి

సీపీఎస్ రద్దుకు పోస్టర్ల ఆవిష్కరణ

హుస్నాబాద్ : కంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని సెప్టెంబర్ 1వ తేదీన సిద్దిపేట జిల్లా కేంద్రంలో నిర్వహించే ధర్నా పోస్టర్‌ను మంగళవారం హుస్నాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ఆవిష్కరించారు. సెప్టెంబర్ ఒకటవ తేదీని పెన్షన్ విద్రోహ దినంగా పాటించాలని పిలుపునిచ్చారు. సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వి.వెంకటరమణారెడ్డి, పీఎస్‌ఈఏ జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్.తిరుపతి, డీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ గడ్డం లక్ష్మారెడ్డి, వెల్లండి సత్యనారాయణ, జి.శంకర్‌నాయక్, సంపత్‌రెడ్డి, తిరుపతి, రాజ్‌మహ్మద్, సుధాకర్, మోహన్ తదితరులున్నారు.



హుస్నాబాద్‌లోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ధర్నా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు



ఉపాధ్యాయులకు టీపీటీఎఫ్ సభ్యత్వాన్ని అందజేస్తున్న జిల్లా అధ్యక్షుడు తిరుపతిరెడ్డి

ధర్నాలను విజయవంతం చేయండి

బెజ్జంకి: సీపీఎస్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా కలెక్టరెట్ల వద్ద నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు తిరుపతిరెడ్డి కోరారు. మండలంలోని గుగ్గిళ్ళ, బేగంపుట, వడ్లూర్, వీరాపూర్, బెజ్జంకి, గుండారం పాఠశాలల్లో సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులకు పెన్షన్ సౌకర్యం లేక అనేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఇంద్రాసేనారెడ్డి, జిల్లా నాయకులు శివాజీ, కౌన్సిలర్లు అమరేందర్‌రెడ్డి, రఘువేందర్ రెడ్డి పాల్గొన్నారు.

ప్రజాసమస్యలపై శ్రద్ధ చూపాలి

● సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు కళావతి

మద్దూరు: అక్రమ కేసులు పెట్టడంలో చూపుతున్న శ్రద్ధ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై చూపాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు కళావతి అన్నారు. మంగళవారం మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ప్రజాసమస్యలపై పోరాడే వారిపై ఎన్ని కేసులు పెట్టినా భయపడేది లేదన్నారు. టీఆర్ఎస్‌కు ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. ఈ కార్యక్రమంలో విజేందర్, మహేందర్, లక్ష్మయ్య, మల్లారెడ్డి, రవి, పరిపూర్ణం, సిద్దు, షఫీ, తాజ్‌అహ్మద్, శ్రీనివాస్, రవి, ప్రశాంత్,ఎల్లయ్య, కిష్టయ్య ఉన్నారు.

'బైరాన్‌పల్లి సభను విజయవంతం చేయాలి'

మద్దూరు: ఈ నెల 4న బైరాన్‌పల్లిలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్ పర్యటనలో భాగంగా నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేయాలని బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర కార్యదర్శి రామదాసు కోరారు. మంగళవారం మండలకేంద్రంలో పార్టీ మండల అధ్యక్షుడు ఇర్రి రాజిరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యకర్త కిరణ్‌కుమార్, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి నర్సింహారెడ్డి, జిల్లాఅధికార ప్రతినిధి బుచ్చిరెడ్డి, ప్రధాన కార్యదర్శి భూపతిరెడ్డి, రాజు, కనకరాజు, బాలేష్ ఉన్నారు.

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం

హుస్నాబాద్ : పట్టణంలో మంగళవారం తెలుగుభాష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు భాష దినోత్సవం సందర్భంగా సమావేశం నిర్వహించారు. తెలుగు భాష, సంస్కృతిని భావి తరాలకు అందించాలని కళాశాల ప్రిన్సిపాల్ కల్పన అన్నారు. అలాగే తెలుగు వెలుగు సంస్థ ఆధ్వర్యంలో కూడా తెలుగు భాష దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలుగు వెలుగు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు నాదమునుల రామారావు, పోలోజు రాజ్‌కుమార్, సుదర్శనం, వెల్పుల కనుకయ్య తదితరులున్నారు.

నర్సాయపల్లిలో

మద్దూరు: మండలంలోని నర్సాయపల్లి ఉన్నత పాఠశాలలో మాతృభాషా దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం సదానందం అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఉపాధ్యాయులు నాగేందర్, ప్రసాద్, భూపతిరెడ్డి, మహేష్ పాల్గొన్నారు.

'బెల్టుషాపులను మూసి వేయాలి'

హుస్నాబాద్ : పట్టణ సర్కిల్ పరిధిలో విచ్చల విడిగా నడుస్తున్న బెల్టుషాపులను మూసివేయాలని ఏఈఎస్‌కు మంగళవారం సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు గడిపే మల్లేష్ వినతిపత్రం అందజేశారు. గతంలో చాలా సార్లు ఈ విషయంపై ఫిర్యాదు చేసిన స్థానిక ఎక్సైజ్ అధికారులు పట్టించుకోలేదన్నారు. గ్రామాల్లో ఇష్టారీతిగా కొనసాగుతున్న బెల్టుషాపులతో అమాయక ప్రజలు మద్యానికి బానిసలవుతున్నారని పేర్కొన్నారు.

బస్సు సమయం మార్చొద్దని విద్యార్థుల ధర్నా

మద్దూరు: విద్యార్థుల సౌకర్యార్థం వేసిన బస్సు సమయపాలన మార్చడాన్ని నిరసిస్తూ మంగళవారం మండలంలోని గాగిల్లాపూర్ గ్రామ విద్యార్థులు బస్సును నిలిపివేసి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడారు. కళాశాలకు సమయానికి చేరుకునే విధంగా ఉన్న బస్సును, మద్దూరు మీదుగా వంగపల్లికి పొడిగించడంతో కళాశాల సమయం దాటినాకా వెళ్లాల్సి వస్తుందన్నారు. గతంలో మాదిరిగా సమయపాలన పాటించి విద్యార్థులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ఘనంగా క్రీడా దినోత్సవం

హుస్నాబాద్ టౌన్ : జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని హుస్నాబాద్ పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో క్రీడోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు టగ్ ఆఫ్ వార్, క్యారమ్స్, హ్యాండ్‌బాల్, పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మెన్ జోస్ నెడుతుండం, అకాడమీ డైరెక్టర్ బైజు వర్గీస్, హెచ్ఎం బొబన్, పాఠశాల డైరెక్టర్ గుండు కిరణ్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

15రోజులైనా డ్రా కాని పంచాయతీ చెక్కులు

హుస్నాబాద్‌రూరల్: గ్రామ పంచాయతీ సాధారణ నిధుల కోసం 15 రోజులుగా చెక్కులు పట్టుకుని తిరుగుతున్నా నిధులు డ్రా కాకపోవడంతో సర్పంచులు, పంచాయతీ తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక ఎస్‌బీహెచ్ బ్యాంకులో పంచాయతీకి సంబంధించిన సాధారణ నిధులు డ్రా చేయాల్సి ఉండగా 15 రోజులైనా బ్యాంకు నుంచి నిధులు డ్రా కావడం లేదని దీంతో పంచాయతీ సిబ్బంది వేతనాలు, గ్రామ అవసరాలకు సంబంధించిన చెల్లింపులు జరగడం లేదన్నారు. బ్యాంకులో సాంకేతిక కారణంగా నిధులు డ్రా కావడం లేదని బ్యాంకు అధికారులు పేర్కొంటున్నట్లు తెలిపారు.

ఎంఈవోపై చర్యలు తీసుకోవాలి

● డీఈవోకు ఫిర్యాదు చేసిన సీపీఐ మండల కార్యదర్శి గడిపె మల్లేష్

హుస్నాబాద్‌టౌన్: విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్న హుస్నాబాద్ ఎంఈవో మారెపల్లి అర్జున్‌పై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని సీపీఐ మండల కార్యదర్శి గడిపె మల్లేష్ ఆధ్వర్యంలో మంగళవారం సిద్దిపేటలోని డీఈవోకు ఫిర్యాదు చేశారు. 10 రోజులుగా ఎలాంటి లీవ్‌పెట్టకుండా విధులకు గైర్హాజరవుతున్నట్లు వారు పేర్కొన్నారు. మూడు నెలలుగా రిజిష్టర్‌లో ఎలాంటి సంతకాలు చేయకుండా విధుల పట్ల పూర్తి నిర్లక్ష్యం వహిస్తున్నాడని, తన వ్యక్తిగత పనులకే ప్రాధాన్యమిస్తూ విధులను పట్టించుకోవడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయంపై ఎంఈవో అర్జున్‌ను వివరణ కోరగా మండలాలు మారినప్పటి నుంచి తాము హాజరు రిజిస్టర్‌ను మార్చినట్లు తెలిపారు. అవుట్‌సోర్సింగ్ రిజిస్టర్‌ను చూసి తాను విధులకు గైర్హాజరవుతున్నట్లు ఫిర్యాదు చేశారని వివరణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మన్నె కుమార్, లింగాల బాబు తదితరులున్నారు.



డీఈవోకు ఫిర్యాదు చేస్తున్న మల్లేష్

ప్రభుత్వాసుపత్రుల్లో నాణ్యమైన వైద్యం అందించాలి

● ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు బోనగిరి రూపేష్

బెజ్జంకి: ప్రభుత్వ ఆసుపత్రులను మెరుగు పరచి నాణ్యమైన వైద్యం అందించాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు బోనగిరి రూపేష్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పోరేట్ ఆసుపత్రులు వచ్చిన తర్వాత వైద్య రంగం పూర్తిగా వ్యాపారంగా మారిపోయి సామాన్య, పేద ప్రజలకు వైద్యం అందని ద్రాక్షలా మారిందన్నారు. ఆరోగ్యశ్రీ పథకం కూడా పక్కతోవ పట్టి ప్రైవేట్ ఆసుపత్రులకు డబ్బులిచ్చే కల్పవృక్షంగా మారిందన్నారు. అన్ని మండల కేంద్రాల్లోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో 50 పడకలను ఏర్పాటు చేయాలన్నారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి పిలుపుమేరకు ఈనెల 28 నుంచి అక్టోబర్ 10వరకు జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ ఆసుపత్రుల సందర్శన, ప్రైవేట్ ఆసుపత్రుల ముందు చేపట్టే ధర్నా కరపత్రాలను ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి సంగ్యం మధు, ఏఐవైఎఫ్ మండల ఉపాధ్యక్షుడు రాకేష్, రమేష్, అనిల్, అంజి, శ్రీనివాస్, రాజయ్య, క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ వర్కర్స్ యూనియన్ కమిటీ ఎన్నిక

హుస్నాబాద్ : పట్టణంలో మంగళవారం అక్కన్నపేట, హుస్నాబాద్ మండలాల గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ వర్కర్స్ యూనియన్ ఎన్నికలు జిల్లా అధ్యక్షుడు వస్త్రాల ప్రమోద్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మండల అధ్యక్షుడిగా గంగారపు దుర్గయ్య, ఉపాధ్యక్షుడిగా కాసర్ల సదానందం, చెప్యాల నర్సమ్మ, కార్యదర్శిగా బంటు రాజమల్లయ్య, సహాయ కార్యదర్శిగా తాడూరి లక్ష్మణ్, కోశాధికారిగా బోనగిరి రమేష్‌తో పాటు ఐదుగురిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. అక్కన్నపేట మండలాధ్యక్షుడిగా మాతంగి సమ్మయ్య, ఉపాధ్యక్షుడిగా రాగటి శ్రీకాంత్, ఎల్‌సాని వెంకటయ్య, ఎరబోతు లక్ష్మీ, కార్యదర్శిగా భూక్య రమేష్‌నాయక్, సహాయ కార్యదర్శిగా గాదర్ల నాగభూషణం, కోశాధికారిగా గొల్లపల్లి ఎల్లయ్యతో పాటు పాటు ఐదుగురిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎం.రేవంత్‌కుమార్, కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కోహెడ కొంరయ్య పాల్గొన్నారు.

తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి

● ఆర్డీవోకు బీజేపీ నాయకుల వినతి

హుస్నాబాద్ : తెలంగాణ విమోచన దినోత్సవం సెప్టెంబర్ 17ను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని బీజేపీ నాయకులు మంగళవారం ఆర్డీవో శంకర్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చినప్పటికీ తెలంగాణలో నిజాం నవాబుల అరాచక పాలన కొనసాగిందని, రజాకార్ల చెరనుంచి విడిపించేందుకు తెలంగాణ యోధుల విరోచిత పోరాటాల వల్ల 1948 సెప్టెంబర్ 17న పూర్తి స్వాతంత్ర్యం సిద్ధించిందన్నారు. కొన్ని సంవత్సరాలుగా తెలంగాణ విమోచన దినోత్సవాన్ని నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు గుత్తికొండ విద్యాసాగర్, కవ్వ వేణుగోపాల్ రెడ్డి, కందుకూరి సతీష్‌కుమార్, ఒగ్గోజు వెంకటేశ్వర్లు, బోనగిరి రవీందర్ తదితరులున్నారు.

వైకుంఠ రథానికి రూ.10.14లక్షలు మంజూరు

హుస్నాబాద్: పట్టణ నగరపంచాయతీలో వైకుంఠ రథం కొనుగోలుకు ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ తనకోటా నుంచి రూ.10,14,600 మంజూరు చేశారు. ఈ నిధులతో వైకుంఠ రథాన్ని కొనుగోలు చేయనున్నారు. నగరపంచాయతీ కమిషనర్ కుమారస్వామి కరీంనగర్‌లోని షోరూంలో వైకుంఠరథాన్ని పరిశీలన చేశారు.

'హెచ్ఎంపై విచారణ చేయాలి'

హుస్నాబాద్ : పట్టణంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో విద్యార్థిని కొట్టిన సంఘటనపై విచారణ జరిపించి హెచ్ఎంపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు అందె అశోక్, కార్యదర్శి ఎస్వీ శ్రీకాంత్ డిమాండ్ చేశారు. మంగళవారం పాఠశాలకు వెళ్ళి సంఘటనపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నామని తెలిపారు.

పీఆర్టీయూ జిల్లా ఉపాధ్యక్షుడిగా నాగేందర్

మద్దూరు: పీఆర్టీయూ ఆధ్వర్యంలో జిల్లాలో నిర్వహించిన ఎన్నికల్లో మద్దూరుకు చెందిన నాగేందర్ జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా పీఆర్టీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు నాళ్ల లక్ష్మయ్య, కీర్తి శ్రీదర్ అభినందించారు.

బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యదర్శిగా అరుణ్‌యాదవ్



బీసీసంఘం జాతీయ అధ్యక్షుడు కృష్ణయ్యకు కృతజ్ఞతలు తెలుపుతున్న అరుణ్‌యాదవ్

ములుగు: బీసీ విద్యార్థి సంఘం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా ములుగు మండలం కొక్కొండ గ్రామానికి చెందిన అరుణ్‌యాదవ్ నియామకమయ్యారు. హైదరాబాద్‌లోని బీసీ భవన్‌లో బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన బీసీ విద్యార్థి సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. కాగా మంగళవారం నిర్వహించిన మేడ్చల్ జిల్లా బీసీ విద్యార్థి సంఘం సమీక్షా సమావేశంలో రాష్ట్ర కార్యదర్శిగా అరుణ్‌యాదవ్‌కు నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సంధర్భంగా అరుణ్‌యాదవ్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన జాతీయ అధ్యక్షుడు కృష్ణయ్య, బీసీ విద్యార్థి సంఘం జాతీయ కన్వీనర్ ర్యాగ అరుణ్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి నరసింహగౌడ్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

'మొక్కలను పెంచడంలో మహిళలు ప్రత్యేక శ్రద్ధ వహించాలి'



మహిళలకు మొక్కలను పంపిణీ చేస్తున్న సర్పంచ్ అర్జున్‌గౌడ్

ములుగు: గ్రామంలోని ప్రతి ఇంటి ముందునాటే మొక్కలు పెంచడంలో మహిళలు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ములుగు మండలం బస్వాపూర్ సర్పంచ్ నర్సంపల్లి అర్జున్‌గౌడ్ కోరారు. మంగళ వారం గ్రామంలోని మహిళలకు మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు మొక్కలు నాటి సంరక్షించినట్లయితే మంచి ఫలితాలు అందుతాయని హరితహారం కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టారన్నారు. పంచాయతీ కార్యదర్శి రాజగోపాల్, గ్రామస్థులు ఉన్నారు.

మహిళలకు కుట్టు మిషన్‌లపై శిక్షణ

జగదేవ్‌పూర్: మండలంలోని ఇటిక్యాల గ్రామంలో ఎస్‌సీవీ రోస్ సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు కుట్టు మిషన్లపై శిక్షణ ఇస్తున్నట్లు ఇటిక్యాల ఎంపీటీసీ భాస్కర్ తెలిపారు. మంగళవారం ఎస్‌సీవీ రోస్ సంస్థ ప్రతినిధులు ఫిలో, శ్రీమోసా, క్యాథలిన్, శ్వేత, దీప ఉన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేర్చాలి

గజ్వేల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలను ప్రజలకు చేర్చేందుకు బ్యాంకర్లు సహకరించాలని లీడ్‌బ్యాంక్ మేనేజర్ కృష్ణప్రసాద్ కోరారు. గజ్వేల్ పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఎస్‌ఎల్‌బీసీ సమావేశాన్ని నిర్వహించగా, ఆయన హాజరై మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ రుణాలను ప్రజలకు అందించేందుకు గాను వచ్చిన దరఖాస్తును సెప్టెంబర్ 15లోగా అందజేయాలన్నారు. పరిశ్రమల అభివృద్ధి శాఖాధికారి నవీన్, కార్పొరేషన్‌ల చైర్మన్లు రాంరెడ్డి, చరణ్‌దాస్, జీవరత్నం, ఎంపీడీవోలు, ఆయా బ్యాంకుల మేనేజర్లు, ఉన్నారు.

వైద్య శిబిరం విజయవంతం

వర్గల్ : వర్గల్ మండలం మజీద్‌పల్లి, నెంటూర్ గ్రామాల్లో నేషనల్ ఆయుష్ మిషన్ ఆధ్వర్యంలో మంగళవారం వెద్య శిబిరం నిర్వహించారు. వెద్య పరీక్షలు నిర్వహించి వైద్యులు మందులు పంపిణీ చేశారు. ఆయుష్ వైద్య బృందం ఉమాదేవి. జ్యోతి, రాణిశర్మ, నాగమణి, సాయిద్, సిబ్బంది శివ. సాయిప్రసాద్. మోహన్, సునీత. శ్యామల ఉన్నారు.

క్రీడలపై యువత మక్కువ పెంచుకోవాలి

- **జీపీఎస్పీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, సీఐలు సతీష్, వెంకటేశం**
- **గజ్వేల్‌లో 2కే రన్ విజయవంతం**



2కే రన్‌లో విజేతలకు బహుమతులను అందజేస్తున్న చైర్మన్ భాస్కర్, సీఐలు



2 కేరన్‌లో పాల్గొన్న సీఐలు సతీష్, ఆకుల వెంకటేశం

గజ్వేల్: క్రీడలపై యువత, విద్యార్థులు దృష్టి సారించాలని జీపీఎస్పీ చైర్మన్ గాడి పల్లి భాస్కర్, గజ్వేల్, తొగుట సీఐలు సతీష్, ఆకుల వెంకటేశంలు అన్నారు. గజ్వేల్ పట్టణంలోని వివేకానందుని విగ్రహం నుంచి ప్రజ్ఞాపూర్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల వరకు జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా 2కే రన్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువకులు, విద్యార్థినీ, విద్యార్థులు క్రీడలపై మక్కువ పెంచుకోవాలని సూచించారు. క్రీడల్లో యువతకు బంగారు భవిష్యత్తు ఉందన్నారు. అంతేకాకుండా క్రీడలతో శారీరక దారుఢ్యంతో పాటు, మానసిక ఉల్లాసం లభిస్తాయన్నారు. ధ్యాన్‌చంద్ జన్మదినాన్ని జాతీయ క్రీడా దినోత్సవంగా జరుపుకోవడం నిజంగా ఆనందమన్నారు. జాతీయ క్రీడ అయిన హకీలో ఆయన సత్తాచాటి క్రీడలను ప్రజల దరికి చేర్చారన్నారు. ఈ 2కే రన్‌లో విజేతలుగా నిలిచిన అండర్-19విభాగంలో రాజిరెడ్డి, బాలకృష్ణ, సలీం, వేణు, అండర్-14లో కృష్ణప్రసాద్, కార్తీక్, మహిళల విభాగంలో ప్రవళిక, మనస్విని, సీనియర్ సిటిజన్స్ విభాగంలో శ్యామ్‌సుందర్, మోతె వీరారెడ్డిలకు వారు బహుమతులు అందజేశారు. వారివెంట ఎస్ఐ కమలాకర్, ప్రసాద్, కమిషనర్ శంకర్, సేవా వలంటరీ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు దేశబోయిన నర్సింలు, పీడీ ఎలియాస్‌రావు, పీఈటీలు నరేశ్, దశరథ, సాఫ్ట్‌బాల్ జిల్లా అధ్యక్షుడు హైదర్‌పటేల్, శ్యాంసుందర్, రాంచంద్రం, సాదక్‌పాషా, సంతోష్, నరేశ్, వినోద్, రాజు, స్వామి తదితరులు ఉన్నారు.

నిర్వాసితులకు ప్రభుత్వం అండగా ఉంటుంది

- **స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వసంత**

కొండపాక : మల్లన్న సాగర్ నుంచి కొండపోచమ్మ రిజర్వాయర్‌కు కాలువ నిర్మాణ పనుల కోసం సేకరించనున్న భూ నిర్వాసితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వసంత అన్నారు. మంగళవారం ముద్దాపూర్ , మంగోల్ గ్రామాల రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వసంత నిర్వాసితులతో మాట్లాడారు. కాలువ నిర్మాణం పనులకు సహకరించాలని కోరారు. ప్రభుత్వం పరిహారం అందిస్తుందని వివరించారు. ఆర్డీవో ముత్యంరెడ్డి , తహశీల్దారు ఆరీఫా , ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు , రైతులు పాల్గొన్నారు.

ఇంటింటికీ విద్యుత్ కనెక్షన్

- **మండల విద్యుత్ అధికారి వేణుగోపాలాచార్యులు**

వర్గల్ : కేంద్ర ప్రభుత్వం రూపొందించిన దీన్‌దయాల్ ఉపాధ్యాయ గ్రామజ్యోతి యోజన పథకం ద్వారా గ్రామంలోని నిరుపేదలందరికీ ఇంటింటికి విద్యుత్ కనెక్షన్ ఇవ్వనున్నట్లు మండల విద్యుత్ అధికారి వేణుగోపాలాచార్యులు తెలిపారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ నిరు పేదలై ఉండి విద్యుత్ సౌకర్యం లేని గృహాలకు ఈ పథకం వర్తిస్తుందన్నారు. రూ. 125 చెలించినట్లయితే వారికి రూ. 2500 విలువగల విద్యుత్ మీటర్‌తో పాటు ఎల్‌ఈడీ బల్బు, సర్వీస్‌వైర్, అవసరమైన చోట స్తంభాలు, వైర్లు ఏర్పాటు చేసి విద్యుత్ కనెక్షన్ ఇవ్వనున్నట్లు తెలిపారు. లబ్ధిదారులకు ఎటువంటి ఖర్చులు లేకుండా పూర్తిగా విద్యుత్ శాఖ భరించడం జరుగుతుందన్నారు.

ఈ పథకం గ్రామీణ ప్రాంతంలో ఉన్న నివాస గృహాల్లోని విద్యుత్ సౌకర్యంలేని పేదలకు వర్తిస్తుందన్నారు. విద్యుత్ కనెక్షన్ లేని పేద కుటుంబాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

6400 మంది విద్యార్థులకు రుబెల్లా టీకాలు



విద్యార్థులకు రుబెల్లా టీకాలు వేస్తున్న వైద్యులు

వర్గల్ : తొమ్మిది నెలల నుంచి 11 సంవత్సరాల లోపు పిల్లలంతా రుబెల్లా టీకాలు తీసుకోవాలని మండల వైద్యాధికారి మాధవి తెలిపారు. మంగళవారం వర్గల్ మండలం మీనాజీపేట ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు తట్టు, రుబెల్లా టీకాలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో 10029 మంది విద్యార్థులు ఉండగా ఇప్పటి వరకు 6400 మంది విద్యార్థులకు తట్టు, రుబెల్లా టీకాలు వేశామన్నారు. ఈ నెల 31 లోపు విద్యార్థులకు టీకాలు వేసి పూర్తిచేస్తామన్నారు. అలాగే వర్షకాలంలో వ్యాపించే సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది తిరుపతమ్మ, భాస్కర్‌తో పాటు విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

రాయపోల్‌లో

రాయపోల్: పిల్లలకు తట్టు, రుబెల్లా వ్యాధులు సోకకుండా వేస్తున్న వ్యాక్సిన్ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. మంగళవారం దౌల్తాబాద్ మండలం తిర్మలాపూర్, మహ్మద్‌షాపూర్, లింగాయపల్లితండా, గొడుగుపల్లి గ్రామాల్లో ఇందుప్రియాల్ పీహెచ్‌సీ సిబ్బంది 9నెలల నుంచి 15ఏళ్ల మధ్య వయస్సు గల పిల్లలకు ఈ టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి రమాదేవి, సూపర్‌వైజర్ రంగమ్మ, ఏఎన్ఎం మార్తా, ఆశావర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

దళితుల భూములను లాక్కోవద్దు'

గజ్వేల్‌టౌన్: గజ్వేల్ మండలంలోని సింగాటం గ్రామంలో ప్రభుత్వ అవసరాల కోసం దళితుల వద్ద నుంచి తీసుకుంటున్న భూమిని వారికే అప్పగించాలని డిమాండ్ చేస్తూ కేవీపీఎస్, మాలమహానాడు ఆధ్వర్యంలో దళితులు మంగళవారం పట్టణంలోని గడ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి అనంతరం వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ డివిజన్ అధ్యక్షుడు చంద రాజు, గ్రామ దళితులు దాసరి మల్లయ్య, దార మల్లయ్య, పోచయ్య, నర్సయ్య, రాజాబాబు, పోచయ్య, శ్రీనివాస్, మల్లేశం పాల్గొన్నారు.

తెలుగుభాషా దినోత్సవ వేడుకలు

గజ్వేల్‌టౌన్: గజ్వేల్ మండలంలోని అహ్మదీపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పాఠశాలలో తెలుగుభాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవాలను మంగళ వారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు.ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు ప్రదానం చేశారు.

నేడు హుండీ లెక్కింపు

వర్గల్ : వర్గల్ మండల నాచగిరి లక్ష్మీనృసింహస్వామి ఆలయం హుండీ లెక్కింపు కార్యక్రమం బుధవారం నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి, సహాయ కమిషనర్ సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఆలయ మండపంలో హుండీ లెక్కింపు జరుగుతుందని తెలిపారు.

బట్టల వర్తక సంఘం అధ్యక్షుడిగా తుమ్మ మల్లేశం

గజ్వేల్: బట్టలవర్తక సంఘం గజ్వేల్ అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన తుమ్మ మల్లేశం ఎన్నికయ్యారు. పట్టణంలోని దొంతుల ప్రసాద్ గార్డెన్స్‌లో సోమవారం రాత్రి నిర్వహించిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా తుమ్మ మల్లేశం, ఉపాధ్యక్షుడిగా ఆరుగొండ రాజు, కార్యదర్శిగా పేర్ల శ్రీనివాస్, కోశాధికారిగా అత్తెల్లి లక్ష్మయ్య, సహాయ కార్యదర్శిగా నర్సింలు ఎన్నికయ్యారు.

కరాటేలో పతకాల వేట

- జాతీయస్థాయిలో రాణిస్తున్న దుబ్బాక జడ్పీ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు
- ప్రోత్సాహం ఉంటే మరింత రాణింపు
- పీడీ, కరాటే శిక్షకుడి ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ


కరాటే ప్రాక్టీస్ చేస్తున్న విద్యార్థినులు

దుబ్బాక: కరాటే అనేది ఎవరికి వారు రక్షించుకునేందుకు నేర్చుకునే యుద్ధవిద్య. ఆత్మరక్షణకు, ఆత్మవిశ్వాసానికి ఇది ఎంతో తోడ్పడుతుంది. దుబ్బాక జడ్పీ బాలికోన్నత పాఠశాల విద్యార్థినలుఉ దీనిపై ఎంతో ఆసక్తి చూపుతున్నారు. రెజియోంకి చోటోకాన్ స్పోర్ట్స్ కరాటేలో వీరు సత్తా చాటుతున్నారు. వీరిలో ఈ విద్య నైపుణ్యాన్ని పెంచేందుకు ధర్మాజీపేటకు చెందిన బురాని శ్రీకాంత్ అనే శిక్షకుడు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. అలాగే పాఠశాల పీడీ సౌందర్య విద్యార్థులకు మరింత ప్రోత్సాహం అందిస్తున్నారు. ప్రభుత్వం ఆర్ఎంఎస్ ద్వారా సహాయం అందిస్తుంది. దీంతో విద్యార్థినులు జాతీయస్థాయి కరాటేలో బంగారు పతకాలను సొంతం చేసుకుంటున్నారు. ఇటీవల సికింద్రాబాద్‌లోని బోడుప్పల్‌లో నిర్వహించిన జాతీయస్థాయి పోటీల్లో పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులకు బంగారు పతకాలు, ముగ్గురికి వెండి పతకాలు లభించాయి. విద్యార్థినుల ప్రతిభ ప్రదర్శనకు స్థానిక ఎమ్మెల్యే సోలిపేట రామలింగారెడ్డి ప్రశంసపత్రాలను అందించారు. పాఠశాలలో సుమారు 500 మందికి పూర్తిస్థాయి శిక్షణను అందిస్తున్నారు. విద్యార్థినులు కూడా మంచి ఉత్సాహాన్ని ప్రదర్శిస్తున్నారు. ఆసక్తిగా కరాటే నేర్చుకుంటున్నారు.

ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం

జపాన్‌కు సంబంధించిన కరాటే మనదేశంలో మంచి ప్రాధాన్యం సాధించింది. కరాటే అనేది ఎలాంటి ఆయుధాలు లేకుండా ఆత్మరక్షణకు నేర్చుకునే విద్య. ప్రాశ్చాత్య దేశాల్లో ఇప్పుడు వేలాది పాఠశాలల్లో దీన్ని ప్రత్యేక పాఠ్యాంశంగా చేర్చారు. తెలంగాణ ప్రభుత్వం ఆడపిల్లల రక్షణకు కరాటే విద్యకు ప్రాముఖ్యం ఇస్తోంది. పాఠశాలల్లో ప్రత్యేక తరగతిగా అనుమతినిచ్చింది. మహిళలు తమని తాము దాడుల నుంచి రక్షించుకునేందుకు షీటీంలు కూడా కరాటేపై ప్రత్యేక తరగతుల ద్వారా శిక్షణ ఇస్తున్నారు. ఇక ఈ విద్య ద్వారా విద్యార్థుల్లో ఏకాగ్రత, ఆత్మస్థైర్యం, ఆత్మవిశ్వాసం పెరుగుతాయి. అలాగే స్వీయ నియంత్రణ, సంకల్ప బలం పెరుగుతుంది.

ప్రత్యేక దుస్తులు కరువు

ప్రభుత్వ జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థినులు పూర్తిగా పేదరికంలో మగ్గుతున్న కుటుంబాలకు చెందిన వారు. వీరిలో చాలామంది హస్టళ్లలో ఉండి చదువుతున్నారు. ప్రభుత్వం అందించే దుస్తులతోనే చదువు కొనసాగిస్తున్నవారే అధికంగా ఉన్నారు. కరాటే విద్య నేర్చుకోవడానికి ప్రత్యేక దుస్తులు ఉండాల్సిన అవసరం ఉంది. దుస్తులు లేకపోవడంతో చాలామంది విద్యార్థినులు పోటీలకు వెళ్లడం లేదు. వివిధ చోట్ల నిర్వహించే జాతీయస్థాయి పోటీలకు వెళ్లాలంటే ప్రయాణ భారం కూడా మోయాల్సి ఉంటుంది. వాటిని భరించలేక చాలామంది వెళ్లడం లేదు. దీంతో వీరి ప్రతిభ వెలుగులోకి రావడంలేదని ఉపాధ్యాయులు పేర్కొన్నారు.



కరాటే ప్రాక్టీస్ చేస్తున్న విద్యార్థినులు, పతకాలు, ప్రశంసా ప్రతాలతో విద్యార్థినులు (ఫైల్)

జాతీయస్థాయికి చేరడం హర్షణీయం



కరాటేలో బాలికలు ఉత్సాహంగా ముందు కెళ్తున్నారు. మా పాఠశాలల్లోని విద్యార్థినులు అన్ని రకాల క్రీడల్లో రాణిస్తున్నారు. కరాటేలో తమ నైపుణ్యాన్ని ప్రదర్శించి జాతీయ స్థాయిలో సత్తా చాటారు. హెచ్ఎం పుష్పవేణి, విద్యార్థినుల తల్లితండ్రుల ప్రోత్సాహం వల్లే ఇది సాధ్యమైంది. అన్ని రకాల అవాంతరాలను అధిరోహించి విద్యార్థినులు కరాటే నేర్చుకుంటున్నారు. కరాటే నేర్చుకునే విద్యార్థినులకు ప్రభుత్వం ఆర్ఎంఎస్ పథకం ద్వారా ఇచ్చే కొద్దిపాటి నిధులను సద్వినియోగం చేసుకుంటున్నాం.

- సౌందర్య, పీడీ, జడ్పీ బాలికోన్నత పాఠశాల, దుబ్బాక

ఆడపిల్లలకు కరాటే అవసరం



నేను పదోతరగతి చదువుతున్నా. కరాటే వల్ల నాకు చదువులో ఏకాగ్రత పెరిగింది. అలాగే ఆత్మవిశ్వాసం పెరిగింది. కరాటే ఎంతో ధైర్యాన్ని ఇస్తుంది. ఆత్మరక్షణ పొందవచ్చనే ధీమా ఉంటుంది. దీనికోసం నిరంతరం శ్రమించాను. మా నాన్న ప్రోత్సాహం, ఉపాధ్యాయుల సహకారంతో జాతీయస్థాయిలో బంగారు పథకం సాధించగలిగా. ప్రతి ఆడపిల్లకు కరాటే అవసరమనేది నా అభిప్రాయం. దీంతో జీవితంలో ఎంతటి సమస్యనైనా ఎదుర్కోగలుగుతాం.

- బడుగు దీప, విద్యార్థిని, బంగారు పతకం గ్రహీత

ప్రోత్సాహం ఉంటే అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తారు



విద్యార్థినులు క్రమశిక్షణతో కరాటే నేర్చుకుంటున్నారు. జాతీయ స్థాయిలో ఇద్దరికీ బంగారు పథకాలు, ముగ్గురికి వెండిపథకాలు రావడం గొప్ప విషయమే. వారు నిరంతరం శ్రమించి, తరగతులకు వస్తున్నారు. వ్యక్తిగత సమస్యలను కూడా పక్కనపెట్టి కరాటే నేర్చుకుంటున్నారు. పాఠశాలలో 500 మంది కరాటేలో శిక్షణ పొందుతున్నారు. వీరిలో నైపుణ్యం ప్రదర్శిస్తున్న విద్యార్థినులు బహుమతులు గెలుచుకుంటున్నారు. వీరికి మరింత ప్రోత్సాహం లభిస్తే అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తారు. వీరిలో చాలామంది కనీసం కరాటే దుస్తులు సమకూర్చుకునే ఆర్థిక స్థోమతలేని వారు ఉన్నారు.

- బురాని శ్రీకాంత్, కరాటే శిక్షకుడు

క్రమశిక్షణ అలవడుతుంది



కరాటేతో ప్రత్యర్థులను ఎలా ఎదుర్కొవాలో తెలుస్తుంది. మంచి ఆలోచనలు మనలో వచ్చేలా తోడ్పడుతుంంది. క్రమశిక్షణ కూడా అలవరుస్తుంది. ప్రతి విషయంలో విజయం కచ్చితంగా వస్తుందనే ధీమా మనలో కలుగుతుంది. చదువుపై శ్రద్ధ కలిగేలా చేస్తుంది. మానసికోల్లాసం కలుగుతుంది.

- శ్వేత, విద్యార్థిని, పదోతరగతి

హిందువుల ఆదిదైవం వినాయకుడు. ఆయనకు చేసే సేవ అంటే అందరికీ ఇష్టమే. నవరాత్రుల్లో మండపాన్ని చక్కగా పూలతో అలంకరించి, విగ్రహాన్ని రకరకాల పుష్పాలతో ముస్తాబు చేయడం పరిపాటి. ప్రస్తుతం పూలు దొరకడం కష్టమైంది. కానీ ముస్లిం వ్యాపారులు వీటిని దూర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. వాటిని అందమైన పూల మాలలుగా తయారుచేసి మండపాల నిర్వాహకులకు అందజేస్తున్నారు. ఇందులో ఆదాయాన్ని అస్సలు ఆశిస్తలేరు. విఘ్నేశ్వరుడిని హిందూ భక్తులు ఆరాధించేందుకు పరోక్షంగా తమవంతు సాయం చేస్తున్నారు.

మతసామరస్య.. పూలమాల



భెల్ చెక్ పోస్టు వద్ద ఏర్పాటు చేసిన పూలదుకాణాలు

- వినాయక నవరాత్రుల్లో వెల్లివిరుస్తోన్న పరమత సహనం
- హిందువుల పండుగకు ముస్లింల పూల సరఫరా
- ధర గిట్టుబాటుకాకున్నా పరోక్షంగా దేవుడికి సేవ చేస్తున్నామంటున్నా ముస్లింలు
- మండపాల నిర్వాహకులకు సాయం
- గంగా జమునా తహజీబ్‌కు నిదర్శనం

పటాన్‌చెరు, రామచంద్రాపురం: వినాయక నవరాత్రుల సందర్భంగా ఏర్పాటు చేసిన మండపాలు ఆధ్యాత్మిక శోభతో పాటు మతసామరస్యాన్ని చాటిచెబుతున్నాయి. హైదరాబాద్ దక్కన్‌లో హిందూ ముస్లిం భాయిభాయి, గంగాజమునా తహజీబ్ విధానానికి అద్దంపట్టే విధంగా మత సహనం కనిపిస్తుంది. హిందువులు ఎంతో పవిత్రంగా నిర్వహించే వినాయక నవరాత్రుల్లో భారీ విగ్రహాలకు వేసే గజమాలలు, పూలదండలు, మండపాల వద్ద నిర్వహించే పూల డెకరేషన్ల పనులన్నీ ఎక్కువగా ముస్లింలే చేస్తున్నారు. జహీరాబాద్, సంగారెడ్డి, సదాశివపేట, నారాయణ్‌ఖేడ్, పటాన్‌చెరు, రామచంద్రాపురం తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వేలాది వినాయక విగ్రహాలకు పూలు సరఫరా చేస్తున్నది ముస్లింలే కావడం విశేషం. నవరాత్రుల నిర్వాహకులతో వీరంతా ముందుగానే ఒప్పందాలు కుదుర్చుకుని నిరంతరం పూలు సరఫరా చేస్తున్నారు. ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహం సైజును బట్టి దండను తయారు చేయాల్సి ఉంటుంది. దీంతో ముస్లింలు విగ్రహాల దగ్గరకు వెళ్లి వాటి సైజ్‌లను తీసుకుని ప్రత్యేక పూల మాలలను తయారు చేస్తున్నారు. 15 నుంచి 24ఫీట్ల వరకు ఎత్తు ఉన్న భారీ విగ్రహాలకు దండలను మండపాల్లోనే ముస్లింలు తయారు చేస్తున్నారు. విగ్రహానికి ఎలాంటి అపాయం కలగకుండా నైపుణ్యంతో నిత్యం పూలదండలను మార్చాల్సి ఉంటుంది. అందుకు అనేక ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు వీరు. ఇలా పరోక్షంగా వినాయక మండపాల్లో మతసామరస్యం ప్రబలుతోంది. చిన్నవిగ్రహాల నిర్వాహకులు నిత్యం ముస్లింల దుకాణాల వద్దకే వెళ్లి కొనుగోలు చేస్తున్నారు. ఇక పూల ధరలు చుక్కలనంటాయి. స్థానికంగా పెద్ద ఎత్తున పూలు లభించక పోవడంతో బెంగళూరు, రాజమండ్రి నుంచి వ్యాపారులు దిగుమతి చేసుకుంటున్నారు. ఒక కిలో పూలకు రూ. 200 నుంచి రూ. 300 దాకా వ్యాపారులు వెచ్చించాల్సి వస్తోంది. అయినా దండలను మాత్రం నిర్వాహకులు అడిగిన రేట్లకే తయారు చేస్తున్నారు. ఇందులో గిట్టుబాటు కాకున్నా భగవంతుడికి పరోక్షంగా సేవ చేస్తున్నామన్న భావన ముస్లింల్లో వ్యక్తమవుతోంది.


పటాన్‌చెరు గౌతంనగర్‌లో వినాయకుడికి అలంకరించిన పూలమాల



అశోక్‌నగర్‌లో ఏర్పాటు చేసిన భారీ వినాయక మండపంలో పూల డెకరేషన్

పరోక్షంగా భగవంతుడికి సేవ



వినాయక నవరాత్రుల్లో సహజంగానే పూలు, దండల గిరాకీ పెద్ద ఎత్తున ఉంటుంది. ఈ సంవత్సరం పూల ధరలు భారీగా పెరగడంతో పెద్దగా గిట్టుబాటు కావడం లేదు. ఎక్కువగా గుడిమల్కాపూర్, ఇంద్రారెడ్డిపూలమార్కెట్, రైతుబజార్ల నుంచి పూలు కొనుగోలు చేస్తున్నాం. పెరిగిన పూల ధరలకు అనుగుణంగా దండల రేట్లు పెంచితే కొనుగోలుదారులు ఇబ్బందులు పడుతున్నారు. అందువల్ల లాభం లేకుండానే అమ్ముతున్నాం. భగవంతుడి సేవలో పరోక్షంగా మేము కూడా పాలుపంచుకుంటున్నామన్న సంతృప్తి కలుగుతోంది.

- మహ్మద్ అక్బర్ బాషా, పూలవ్యాపారి, లింగంపల్లి

గిట్టుబాటు కాకున్నా.. నవరాత్రుల్లో ఇబ్బందులు తలెత్తకుండా చేస్తున్నాం

ముందస్తు ఆర్డర్లు తీసుకుని నిత్యం వినాయకులకు రకరకాల పూల దండలను, గజమాలలను జిల్లా వ్యాప్తంగా సరఫరా చేస్తున్నాం. 25ఏళ్లుగా పూలవ్యాపారం నిర్వహిస్తున్నాం. పూలధర విపరీతంగా పెరగడంతో పెద్దగా గిట్టుబాటు కావడం లేదు. అయితే నవరాత్రులకు ఇబ్బందులు ఏర్పడవద్దన్న భావన మాలో ఉంది. గిరాకీ మాత్రం పెద్ద ఎత్తున ఉంది. సరిపడ పూలు మన వద్ద పండకపోవడంతో ఇబ్బందులుపడుతున్నాం. దీనికి తోడు వర్షాల వల్ల తెచ్చిన పూలు వెంటనే వాడిపోతున్నాయి.



- ఎండీ సాహెబ్, పూల వ్యాపారి, సంగారెడ్డి

పిడుగుల కాలం.. జాగ్రత్తగా అడుగు వేద్దాం

- వర్షాకాలంలో పొంచి ఉన్న ప్రమాదం
- సూచనలు పాటిస్తే ప్రమాదం బారి నుంచి తప్పించుకోవచ్చు



కంది : వర్షాకాలం వచ్చిందంటే ఒక పక్క సంతోషం మరో పక్క భయం. వానలు వ్యవసాయానికి ఎంతో మేలు చేస్తాయి. అదే వానల వల్ల భూమ్మీద పడే పిడుగులు రైతులల్లో భయాన్ని కలిగిస్తున్నాయి. ప్రతిసారి వర్షాకాలంలో పిడుగు పాటుతో అనేక మంది ప్రాణాలు కోల్పోతునే ఉంటారు. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ పనులకు వెళ్లే వారు, పశువులను మేతకు తీసుకెళ్లే వారు పిడుగు పాటుతో ఎక్కువగా మృత్యువాత పడుతున్నారు. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడుతున్నప్పుడు కనీస జాగ్రత్తలు తీసుకుంటే ప్రాణాలను కాపాడుకోవచ్చు. అసలు పిడుగు అంటే ఏమిటి? అదేలాపడుతుంది ఎక్కెడెక్కడ పడే అవకాశాలున్నాయనే విషయాలను తెలుసుకుని అప్రమత్తంగా ఉంటే దాని బారి నుంచి బయటపడే ఆస్కారం ఉంది.

మనుషులపై పడడానికి కారణం ఇదే

అత్యధిక విద్యుత్ కలిగిన పిడుగు మనషుల మీద పడితే వెంటనే ప్రాణాలు పోతాయి. పశువులు మృత్యువాత పడతాయి. చెట్లు కాలిపోతాయి, భవనాలు బీటలు వారి ఆ శబ్దానికి కిటికీల అద్దాలు పగులుతాయి. మానవ శరీరం నుంచి విద్యుత్ ప్రవహిస్తుంది. అందుకే పిడుగు పడే అవకాశం గల పొలాలు, మైదానం వంటి ప్రాంతాల్లో మనిషి ఉంటే అక్కడి మేఘానికి భూమిని చేరడానికి దగ్గర దారి అవటం వల్ల మనిషిపై పిడుగు పడుతుంది.

భూమి మీదే ఎందుకు పడాలి?

మేఘాల్లో ఉత్పత్తి అయిన విద్యుత్ ధనావేశ స్వభావం కలిగి ఉంటుంది. ఈ ఆవేశం కొల్పోయి తటస్థం అయ్యేందుకు సదరు మేఘం అంతే స్థాయిలో గల రుణావేశం కోసం చూస్తుంది. సమాన ధన, రుణ ఆవేశాలు కలిస్తే మేఘం తన ఆవేశాన్ని కొల్పోయి శాంతిస్తుంది. కాగా, ఆకాశంలో ధనావేశానికి మేఘానికి రుణావేశం దొరకదు. అందుకే భూమిని చేరడానికి ప్రయత్నిస్తుంది. అందుకే ఆవేశిత మేఘం తనున్న ప్రాంతంలో భూమిపై ఎత్తయిన ప్రదేశం ద్వారా భూమిని చేరడానికి ప్రయత్నిస్తుంది. ఇందుకోసం మేఘం తనున్న కింది ప్రాంతంలో ఎత్తుగా ఉన్న ప్రదేశాలు చెట్లు, టవర్లు, ఎత్తయిన భవనాలపై రుణావేశాన్ని ప్రేరేపించి తద్వారా భూమి చేరుతుంది. అయితే గాలిలో విద్యుత్ ప్రవహించదు. మేఘం ఆకాశం నుంచి అత్యధిక శక్తితో గాలితో స్వల్ప కాలం శూన్యాన్ని సృష్టించి భూమిని చేరుతుంది. ఈ సందర్భంలో గాలిలో తీవ్రమైన శబ్ద తరంగాలు ఉత్పన్నమై పెద్ద శబ్దాన్ని సృష్టిస్తుంది.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- పిడుగు సహజంగా ఎత్తైన ప్రదేశాలు తాటి, ఇతర ఎత్తైన చెట్లు, టవర్లు, పెద్ద భవంతులపై పడే అవకాశం ఉంది.
- వర్షం పడుతున్న సమయంలో తప్పనిసరి చెట్టు కిందకి వెళ్లాల్సి వస్తే పెద్ద చెట్టుకి కాస్తంత దూరంలో ఉన్న చిన్న చెట్టు కిందికి వెళ్లాలి.
- పిడుగు పడుతుందని అనుమానించిన సందర్భంలో పశువుల మంద సమీపంలో ఉండకూడదు. గొర్రెలు, బర్రెలు ఇతరత్రా పశువుల మందంపై పిడుగు పడే అవకాశం ఎక్కువగా ఉంటుంది.
- పొలాల్లో పని చేస్తున్నప్పుడు ఆ ప్రదేశంలో అదేపనిగా ఆకాశంలో మెరుస్తున్నప్పుడు వెంటనే అక్కడి నుంచి కొంచెం దూరం నడుచుకుంటూ వెళ్లాలి. మెరుపు తీవ్రత ఎక్కువై వెంటనే పిడుగుపడే అవకాశముంటే మనుషుల శరీరంపై రోమాలు నిక్కబొడుచుకుంటాయి. ఆ సమయంలో వెంటనే అప్రమత్తమై పొలాల్లో ఒడ్డును అనుకుని నేలపై పడుకోవాలి.
- వర్షం పడుతున్న సమయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ కొండ చరియల ప్రాంతాల్లో ఉండకూడదు.
- మనుషులకు సమీపంలో పడినప్పుడు మిరమిట్లు గొలిపే కాంతికి చెవులు చిల్లులు పడే శబ్దానికి మూర్ఛపోయే ప్రమాదం ఉంటుంది. అలాంటి వారికి శ్వాస ఆడేలా చేయాలి. చిన్న చిన్న జాగ్రత్తలతో ప్రాణాలు కాపాడుకోవచ్చు.
- ఇంట్లో ఉన్నప్పుడు వర్షం పడితే తలుపులు, కిటికీలు మూసి ఉంచాలి. టీవీ, సెల్‌ఫోన్లు, ఫ్యాన్లు, ఫ్రిజ్‌లు లాంటి విద్యుత్ ఉపకరణాలను వాడకూడదు.
- ఇంటికి విద్యుత్ సరఫరా జరిగే మెయిన్ స్విచ్ ఆఫ్ చేసి ఉంచితే మరీ మంచిది. పిడుగుల సమయంలో ఇనుము, రాగి వస్తువులను దగ్గర ఉంచకూడదు. వాటికి పిడుగులకు ఆకట్టుకునే శక్తి ఎక్కువగా ఉంటుంది.

పిడుగు అంటే..

వివిధ కారణాలతో మేఘాల్లో ఉత్పత్తి అయిన విద్యుత్ భూమికి చేరడాన్నే పిడుగు అని అంటారు. నాలుగు నుంచి ఆరు కిలోమీటర్ల ఎత్తు నుంచి పిడుగులు పడుతుంటాయి. కొన్ని మిలియన్ ఓల్టుల పొటెన్షియల్, 10వేల ఆంపియర్ల విద్యుత్ ప్రవాహంతో సుమారు 35 వేల డిగ్రీల ఉష్టోగ్రతతో కొన్ని సెకన్ల కాలంలో పిడుగు భూమిని చేరుతుంది. ఇంతటి తీవ్రత కలిగిన పిడుగు మనుషులపై, పశువులపై, చెట్లపై పడినప్పుడు మండిపోవడం మనం చూస్తూనే ఉన్నాం. పిడుగు పడుతున్నప్పుడు మెరుపు, శబ్ధం ఒకే సారి ఉత్పత్తవుతుంది. మెరుపు మన కళ్లకు వెంటనే చక్‌మనిపించినా మన నుంచి పిడుగు ఉత్పత్తి స్థానాన్ని బట్టి 4నుంచి 8సెకండ్ల కాలంలో తీవ్రమైన శబ్దం వినిపిస్తుంది. మెరుపు ఒక పెద్ద తీగకు రెమ్మల కనిపించినా ప్రధానంగా భూమిని చేరే పిడుగు మాత్రం రెండు లేదా మూడు ఇంచుల వ్యాసంతో ఉంటుంది. పిడుగు సెకన్‌కు 3లక్షల కిలో మీటర్లు ప్రయాణిస్తే, దాని ధ్వని సెకండ్‌కు 340 మీటర్లు మాత్రమే ప్రయాణిస్తుంది. మెరుపు (కాంతి) మెరిసిన కొద్దిసేపటికీ ఉరుము వినిపిస్తుంది. కానీ చాలా మందికి ఈ విషయం తెలియక ఉరుము వినపడినప్పుడే పిడుగు పడిందని భయపడుతుంటారు. నిజానికి అది కొన్ని సెకన్ల క్రితం పడిన పిడుగు శబ్దమే.

'భిన్న పరీక్ష' నుంచి కచ్చితంగా ప్రశ్నలు

భిన్న పరీక్ష

ప్రస్తుత పోటీ పరీక్షల్లో భిన్న పరీక్ష విభాగానికి సంబంధించిన ప్రశ్నలు రెండు లేదా మూడు తప్పనిసరిగా ఉంటున్నాయి. ఎస్ఐ తదితర పరీక్షల్లో ఈ విభాగం నుంచి 8 లేదా 10 ప్రశ్నలు కచ్చితంగా వస్తున్నాయి. కాబట్టి రీజనింగ్‌లో ఈ టాపిక్ చాలా ముఖ్యమైంది. ఈ టాపిక్‌కు సంబంధించిన ప్రశ్నల్లో నాలుగు లేదా ఐదు పదాలు/ పదాల జతలు / సంఖ్యలు/ వర్ణమాల అక్షరాల సమూహాలను ఇస్తారు. ప్రశ్న & సమాధానాలుగా ఇచ్చే ఎ, బి, సి, డిల్లో ఒకటి మినహా మిగిలినవన్నీ ఒకే లక్షణంతో ఉంటాయి. ఆ విధంగా భిన్నంగా ఉండే పదం/ పదాల జత/ సంఖ్య/ వర్ణమాల అక్షరాల సమూహాన్ని సమాధానంగా గుర్తించాలి. అంటే ఇచ్చిన ఎ, బి, సి, డిల్లో భిన్నంగా ఉన్న దానిని తొలగించాలి.

ఈ విభాగంలో మూడు మోడల్స్ ఉన్నాయి. అవి..

1. పదాలతో భిన్న పరీక్ష
2. భిన్నమైన సంఖ్యను కనుక్కోవడం
3. భిన్నమైన వర్ణమాల అక్షరాల సమూహాన్ని గుర్తించడం

మోడల్ - 1
పదాలతో భిన్న పరీక్ష

ఇందులో రెండు రకాలు ఉన్నాయి. అవి..

టైప్ 1: నాలుగు పదాలు ఇచ్చి భిన్నమైన దానిని సమాధానంగా గుర్తించమని అడుగుతారు.

టైప్ 2: నాలుగు పదాల జతలను ఇచ్చి భిన్నమైన జతను సమాధానంగా గుర్తించమని అడుగుతారు.

టైప్ 1

1. ఎ) భరతనాట్యం బి) కూచిపూడి
సి) భాంగ్రా డి) యక్షగానం
సమాధానం: సి
వివరణ: భాంగ్రా మినహా మిగిలినవన్నీ శాస్త్రీయ నృత్యాలు. భాంగ్రా జానపద నృత్యం.

2. ఎ) అక్టోబరు బి) నవంబరు
సి) డిసెంబరు డి) జనవరి
సమాధానం: బి
వివరణ: నవంబరు మినహా మిగిలిన నెలలకు నెలకు రోజులు 31. కానీ, నవంబరు నెలలో 30 రోజులు మాత్రమే ఉంటాయి.

3. ఎ) ముఖ్యమంత్రి బి) లోక్‌సభ సభ్యుడు
సి) రాజ్యసభ సభ్యుడు డి) ప్రధానమంత్రి
సమాధానం: ఎ
వివరణ: ముఖ్యమంత్రి మినహా మిగిలిన వ్యక్తులు కేంద్ర ప్రభుత్వానికి చెందిన వారు.

4. ఎ) కోహిమా బి) ఇంఫాల్ సి) అగర్తల డి) పట్నా
సమాధానం: డి
వివరణ: పట్నా మినహా మిగిలినవన్నీ వివిధ ఈశాన్య రాష్ట్రాల రాజధానులు

5. ఎ) పెల్లాగ్రా బి) బెరిబెరి సి) ఎనీమియా డి) గాయిటర్
సమాధానం: డి
వివరణ: గాయిటర్ మినహా మిగిలనవన్నీ విటమిన్ లోపంతో వస్తాయి. కానీ, గాయిటర్ వ్యాధి మాత్రం అయోడిన్ లోపంతో వస్తుంది.

6. ఎ) బ్యాడ్మింటన్ బి) చెస్ సి) క్యారమ్స్ డి) బిలియర్డ్స్
సమాధానం: ఎ
వివరణ: బ్యాడ్మింటన్ తప్ప మిగిలినవి ఇండోర్ గేమ్స్

7. ఎ) మే బి) జూన్ సి) జూలై డి) ఆగస్టు
సమాధానం: బి
వివరణ: జూన్ మినహా మిగిలిన అన్ని నెలలకు నెలకు 31 రోజులు ఉంటాయి.

8. ఎ) నైల్ బి) ఓల్గా సి) నయాగరా డి) అమెజాన్
సమాధానం: సి
వివరణ: నయాగరా మినహా మిగిలినవన్నీ నదుల పేర్లు. నయాగరా అనేది జలపాతం.

9. ఎ) గుండె బి) నేత్రం సి) చెవి డి) కాలు
సమాధానం: ఎ
వివరణ: గుండె తప్ప మిగిలినవి జతగా ఉంటాయి.

10. ఎ) నియాసిన్ బి) ట్రిప్సిన్
సి) థయామిన్ డి) రైబోఫ్లోవిన్
సమాధానం: ఎ



Panditi Meenakshi Pavan
Senior Faculty

Competitive Exams Special

వివరణ: ట్రిప్సిన్ మినహా మిగిలినవన్నీ విటమిన్ పేర్లు. ట్రిప్సిన్ అనేది ఎంజైమ్.

11. ఎ) బంతి బి) చేమంతి సి) తామర డి) గులాబి
సమాధానం: సి
వివరణ: తామర మినహా మిగిలిన పువ్వులన్నీ భూమి మీద పెరుగుతాయి. తామర నీటిలో పెరుగుతుంది.

12. ఎ) పోలెండ్ బి) గ్రీస్ సి) స్పెయిన్ డి) కొరియా
సమాధానం: డి
వివరణ: కొరియా మినహా మిగిలిన దేశాలు యూరప్ ఖండంలోనివి. కానీ, కొరియా ఆసియా ఖండానికి సంబంధించిన దేశం.

13. ఎ) చెన్నై బి) హైదరాబాద్ సి) బెంగళూరు డి) లక్నో
సమాధానం: డి
వివరణ: లక్నో మినహా మిగిలినవన్నీ వివిధ దక్షిణ భారత రాష్ట్రాల రాజధానులు. లక్నో మాత్రం ఉత్తర భారతంలోని రాష్ట్రానికి సంబంధించిన రాజధాని.

14. ఎ) కివి బి) గద్ద సి) పెంగ్విన్ డి) ఆస్ట్రిచ్
సమాధానం: బి
వివరణ: గద్ద మినహా మిగిలిన పక్షులు ఎగరలేనివి. గద్ద ఎగిరే పక్షి.

15. ఎ) గోధుమ బి) ఆవాలు సి) వేరుశనగ డి) వరి
సమాధానం: డి
వివరణ: వరి మినహా మిగిలినవన్నీ రబీ పంటలు. వరి ఖరీఫ్ పంట

16. ఎ) బైకాల్ బి) థాల్ సి) చిలక డి) థార్
సమాధానం: డి
వివరణ: థార్ మినహా మిగిలినవన్నీ వివిధ సరస్సుల పేర్లు. థార్ అనేది ఎడారి.

17. ఎ) కోణార్క్ బి) మదురై సి) ఎల్లోరా డి) దిల్వారా
సమాధానం: సి
వివరణ: ఎల్లోరా మినహా మిగిలినవన్నీ ప్రసిద్ధ దేవాలయాలు ఉన్న ప్రదేశాలు. ఎల్లోరా ప్రసిద్ధ గుహలు ఉన్న ప్రదేశం

18. ఎ) రుగ్వేదం బి) ఆయుర్వేదం
సి) సామవేదం డి) యజుర్వేదం
సమాధానం: బి
వివరణ: ఆయుర్వేదం మినహా మిగిలినవి వేదాలు. ఆయుర్వేదం అనేది వైద్య శాస్త్రం.

19. ఎ) గ్రానైట్ బి) లిగ్నైట్ సి) ఆంత్రసైట్ డి) బిటూమినస్
సమాధానం: ఎ
వివరణ: గ్రానైట్ మినహా మిగిలినవి బొగ్గు రూపాంతరాలు. గ్రానైట్ అనేది విలువైన రాయి.

20. ఎ) సంతాల్స్ బి) ఖోండ్స్ సి) అబోర్స్ డి) జోగ్రి
సమాధానం: డి
వివరణ: జోగ్రి మినహా మిగిలినవన్నీ వివిధ గిరిజన జాతులు. జోగ్రి అనేది ఒక భాష.

21. ఎ) కాలువ బి) వంతెన సి) ప్రవాహం డి) సెలయేరు
సమాధానం: బి
వివరణ: వంతెన మినహా మిగిలినవి నీటితో ఉంటాయి.

22. ఎ) నేపాల్ బి) టోక్యో సి) కాబూల్ డి) బీజింగ్
సమాధానం: ఎ
వివరణ: నేపాల్ మినహా మిగిలినవి వివిధ దేశాల రాజధానులు. నేపాల్ అనేది ఒక దేశం.

23. ఎ) మహావీరుడు బి) గౌతమబుద్ధుడు
సి) మహాత్మాగాంధీ డి) గురునానక్
సమాధానం: సి
వివరణ: మహాత్మాగాంధీ మినహా మిగిలిన వారు ప్రసిద్ధ మతాల స్థాపకులు.

24. ఎ) రాజీవ్‌గాంధీ బి) జవహర్‌లాల్ నెహ్రూ
సి) చరణ్ సింగ్ డి) బాబూ రాజేంద్రప్రసాద్
సమాధానం: డి
వివరణ: బాబూ రాజేంద్రప్రసాద్ మినహా మిగిలినవారు ప్రధానమంత్రులు. బాబూ రాజేంద్ర ప్రసాద్ రాష్ట్రపతిగా బాధ్యతలు నిర్వహించారు.

25. ఎ) పాదరసం బి) ఆక్సిజన్
సి) మెగ్నీషియం డి) సోడియం
సమాధానం: ఎ
వివరణ: నాలుగూ మూలకాలే. కానీ, పాదరసం ద్రవరూప మూలకం.

26. ఎ) కలం బి) నల్లబల్ల సి) కాగితం డి) పలక
సమాధానం: ఎ
వివరణ: కలం మినహా మిగిలిన వాటిపై వివిధ వస్తువులతో రాయవచ్చు. కలం మాత్రం రాయడానికి ఉపయోగించేది.

27. ఎ) గారో బి) ఖాశీ సి) కాంగ్రా డి) జెంతియా
సమాధానం: సి
వివరణ: కాంగ్రా మినహా మిగిలినవి కొండలు. కాని, కాంగ్రా లోయ.

28. ఎ) జూన్ బి) సెప్టెంబరు సి) నవంబరు డి) ఆగస్టు
సమాధానం: డి
వివరణ: ఆగస్టు మినహా మిగిలిన నెలలకు నెలకు 30 రోజులు ఉంటాయి. ఆగస్టు నెలకు మాత్రం 31 రోజులు ఉంటాయి.

29. ఎ) మార్చి బి) జూలై సి) ఆగస్టు డి) మే
సమాధానం: సి
వివరణ: అన్ని నెలలకు 31 రోజులు ఉన్నాయి. మార్చి 3వ నెల, జూలై 7వ నెల, మే 5వ నెల అంటే మార్చి, మే, జూలై బేసి నెలలు. ఆగస్టు అనేది 8వ నెల అంటే సరి సంఖ్యకు సంబంధించిన నెల.

30. ఎ) నారింజ బి) పసుపు సి) ఆకుపచ్చ డి) గులాబి
సమాధానం: డి
వివరణ: గులాబీ మినహా మిగిలినవి ఇంద్రధనస్సు రంగుల్లో ఉంటాయి.

31. ఎ) న్యూటన్ బి) మార్కోని సి) బీతావన్ డి) పాశ్చర్
సమాధానం: సి
వివరణ: బీతావన్ మినహా మిగిలిన వ్యక్తులు శాస్త్రవేత్తలు.

32. ఎ) క్యారట్ బి) అల్లం
సి) బీట్‌రూట్ డి) ఆనపకాయ
సమాధానం: డి
వివరణ: ఆనపకాయ మినహా మిగిలిన కూరగాయలు భూమి నుంచి వస్తాయి.

33. ఎ) గుండె బి) చెవి సి) ముక్కు డి) నేత్రాలు
సమాధానం: ఎ
వివరణ: గుండె మినహా మిగిలినవి జ్ఞానేంద్రియాలు.

34. ఎ) బిందుసారుడు బి) బింబిసారుడు
సి) అశోకుడు డి) సంప్రాప్తి
సమాధానం: బి
వివరణ: బింబిసారుడు మినహా మిగిలిన వ్యక్తులు మౌర్య వంశానికి చెందిన వారు. బింబిసారుడు హర్యంక వంశానికి వ్యక్తి.

35. ఎ) దాద్రానగర్ హవేలీ
బి) అండమాన్ నికోబార్ దీవులు సి) పాండిచ్చేరి
డి) జార్ఖండ్
సమాధానం: డి
వివరణ: జార్ఖండ్ మినహా మిగిలినవి కేంద్ర పాలిత ప్రాంతాలు. జార్ఖండ్ అనేది రాష్ట్రం పేరు.

36. ఎ) బుల్లి బి) కార్నర్ సి) బంకర్ డి) డ్రిబుల్
సమాధానం: సి
వివరణ: బంకర్ మినహా మిగిలిన పదాలు హాకీ క్రీడకు సంబంధించినవి.

37. ఎ) బీర్బల్ బి) ఫైజ్ అహ్మద్
సి) అబుల్ ఫజల్ డి) తాన్‌సేన్
సమాధానం: బి
వివరణ: ఫైజ్ అహ్మద్ మినహా మిగిలిన వ్యక్తులు అక్బరు ఆస్థానానికి చెందిన వారు.

38. ఎ) ఆసియా బి) అర్జెంటీనా సి) ఆఫ్రికా డి) ఆస్ట్రేలియా
సమాధానం: బి
వివరణ: అర్జెంటీనా మినహా మిగిలినవి ఖండాల పేర్లు

39. ఎ) మెరీనా బి) జెర్సోప్పా సి) విక్టోరియా డి) ఏంజెల్
సమాధానం: ఎ
వివరణ: మెరీనా మినహా మిగిలినవి జలపాతాలు. మెరీనా అనేది ఒక బీచ్.

JOBS ఉద్యోగాలు

సిడాక్

నోయిడాలోని సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్ (సిడాక్)- కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది

మొత్తం ఖాళీలు: 67

ప్రాజెక్ట్ మేనేజర్ **ఖాళీలు:** 2
అర్హత: బిఇ/ బిటెక్/ ఎంఇ/ ఎంటెక్ (కంప్యూటర్ సైన్స్/ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ/ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్)/ ఎంసిఏ ఉత్తీర్ణులై ఉండాలి. డిగ్రీతో పదకొండేళ్లు/ పీజీతో ఏడేళ్ల అనుభవం ఉండాలి
వయసు: 50 ఏళ్లు మించరాదు

ప్రాజెక్ట్ ఇంజనీర్ **ఖాళీలు:** 65
అర్హత: బిఇ/ బిటెక్/ ఎంఇ/ ఎంటెక్ (కంప్యూటర్ సైన్స్/ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ/ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్)/ ఎంసిఏ ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం మూడు నుంచి ఏడేళ్ల అనుభవం ఉండాలి
వయసు: 37 ఏళ్లు మించరాదు

ఎంపిక: ఆన్‌లైన్ టెస్ట్/ ఇంటర్వ్యూ ద్వారా
ఆన్‌లైన్ టెస్ట్: సెప్టెంబరు 23
దరఖాస్తు ఫీజు: రూ.500
ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొన్న తరవా త హార్డు కాపీని నిర్దేశిత చిరునామాకు పంపాలి.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:సెప్టెంబరు 18
చిరునామా: Section in Charge(HR - II), Ce ntre for Development of Advanced Comp uting(CDAC), Academic Block, B - 30, Institutional Area, Sector - 62, Noida - 201307
వెబ్‌సైట్: http://cdac.in/

ఎస్ఎస్‌సి ఎస్ఆర్

స్టాఫ్ సెలక్షన్ కమిషన్ సదరన్ రీజియన్ (ఎస్ఎస్‌సి ఎస్ఆర్) - కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

మొత్తం ఖాళీలు: 66

టెక్నికల్ సూపరింటెండెంట్ **ఖాళీలు:** 3
అర్హత: డిప్లొమా (హ్యాండ్లూమ్ టెక్నాలజీ/ టెక్స్‌టైల్ టెక్నాలజీ) పూర్తిచేసి ఉండాలి.
వయసు: 30 ఏళ్లు మించరాదు.

వర్క్‌షాప్ సూపరింటెండెంట్ **ఖాళీలు:** 1
అర్హత: బిఇ/ బిటెక్ (మెకానికల్) ఉత్తీర్ణులై ఉండాలి
వయసు: 30 ఏళ్లు మించరాదు.

సీనియర్ ఇన్‌స్ట్రక్టర్ (వీవింగ్) **ఖాళీలు:** 1
